# పరలోక భావన
# భారతీయ సంప్రదాయాలు



TTD TRUST
107

Tasavvure Aaquirath
Aur Hindustani Riwaayaath
(Telugu)

# పరలోక భావన
# భారతీయ సంప్రదాయాలు

మూలం:

**మౌలానా ముహమ్మద్ ఫారూఖ్ ఖాన్**

అనువాదం:

**ఎస్.యం. ఖాద్రి**

HYDERABAD
**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (Regd.)**
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్
హైదరాబాద్-500 002. **Ph: 040-24576237**

**Paraloka Bhavana - Bharateeya Sampradaayaalu**
Tasavvure Aaquirath Aur Hindustani Riwaayaath (Telugu)

TIP Series. No. **107**

Written by : Maulana Muhammad Farooq Khan

Translated by : S.M. Quadri

All Rights Reserved with Publishers

5th Edition : September 2016

Copies : 1000

**Price** : **Rs. 25**

ISBN : 81-88241-03-2

Published by : Telugu Islamic Publications
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# మత విశ్వాసాలు, సిద్ధాంతాల అధ్యయనం

ఓ జాతికి సంబంధించిన సిద్ధాంతాల్ని, మత విశ్వాసాల్ని, కూలంకషంగా సమీక్షించి, విమర్శనాత్మక దృష్టితో వాటిలోని సత్యాసత్యాలను వెలికితీయడం అనేది అతిక్లిష్టమైన పని. ఇలాంటి ప్రయత్నంలో మనిషికి, తన సొంత ఆలోచనలు, సొంత జాత్యాభిమానాలు అడ్డుతగులుతూ ఉంటాయి. యదార్థాన్ని గురించిన అవగాహన లేమి అతణ్ణి అపమార్గాల వైపునకు మళ్ళించనూవచ్చు. ఫలితంగా ఈ విషయంలో మనిషి తాను చేసిన కృషి ద్వారా సత్యాసత్యాలను వెలికితీయడం, ఇతరులకు కలిగే సందేహాలను నివృత్తి చేయడంలో సఫలం కాలేకపోతాడు. ఒక్కొక్కప్పుడు ఇలాంటి ప్రయత్నాలు అసలు వాస్తవాన్నే చిక్కుల్లో పడవేస్తుంటాయి కూడా.

జాతుల ఆలోచనలు, సిద్ధాంతాలపై ఇప్పటిదాకా జరిగిన కృషిని గనక సమీక్షిస్తే, నేను చెప్పిందే యదార్థమని మీరు నన్ను బలపరుస్తారు. మనిషి తాను ఓ విషయాన్ని అధ్యయనం చేసి ఆ అధ్యయనం ద్వారా తాను నిజాన్ని గ్రహించగలగడం అన్నది కార్యరూపంగా అసంభవమైన విషయం. సాధారణంగా మనిషి ఓ విషయాన్ని గురించి ముందే ఓ నిర్ణయానికి వచ్చి ఉంటాడు. ఆపై తన కృషినంతా, తాను మొదట అనుకున్నదే యదార్థమని, ఆ యదార్థాన్ని రుజువు చేయడానికే తన శ్రమనంతా ధారబోసి అనేక ఆధారాలను సమకూర్చే ప్రయత్నం చేస్తాడు. తన పరిశోధనలో అతడు, తాను ఏదైతే సాధించ ప్రయత్నం చేస్తున్నాడో ఆ ప్రయత్నాలకు సరిపడని, సహాయపడని అంశాలన్నింటిని ఉపేక్షిస్తాడు లేక ఆ అంశాలకు వక్ర భాష్యాలు చేస్తాడు. ఇలాంటి పరిశోధనా రీతిని మనం పరిశోధన అని అనలేం.

నిజం చెప్పాలంటే, మనిషి చిత్తశుద్ధి కలిగి ఎంత నిష్పక్షపాత దృష్టితో మెలిగినా ఫలితాన్ని పొందడం అంత సులువైన విషయం కాదు.

మానవ జీవితంలోని ఇతర విషయాల్లో దైవమార్గ దర్శకత్వం ఎలా అవసరమవుతుందో, ఈ అధ్యయనం కోసం కూడా దైవ మార్గదర్శకత్వం అంతే

అవసరం. అది లేకపోతే ఈ మార్గంలో క్షేమంగా నడవడం దాదాపు అసంభవమే. 'దివ్య ఖుర్‌ఆన్' అవతరణకు పూర్వం దైవగ్రంథాలు సురక్షితంగా లేవు. సత్యం వైపునకు మార్గం చూపే మరే ఇతర మార్గం కూడా లేకపోయింది. మతాల పరిస్థితి ఆరిపోయిన దీపంతో సమానంగా ఉండింది. ప్రజలు శతాబ్దాల తరబడి ఎలాంటి జ్ఞానం లేకుండా జీవితాన్ని గడిపేవారు. ఆ కాలంలో పరిశోధన కోసం చేసిన ప్రతి కృషి సత్యాన్ని ప్రస్ఫుటం చేసే బదులు దాన్ని మరింత జటిలంగా, అనుమానాస్పదంగా మార్చివేసింది. ఖుర్‌ఆన్ అవతరణ తరువాత కూడా ఈ మార్గదర్శకత్వాన్ని పట్టించుకోకుండా ఏ పరిశోధనలైతే చేయబడ్డాయో, ఖుర్‌ఆన్ అవతరణకు పూర్వం ఉన్న పరిస్థితికంటే ఏ మాత్రం మెరుగ్గా లేవు. సత్యాన్ని అసత్యంగా, అసత్యాన్ని సత్యంగా రుజువు చేయడానికి చేయబడ్డ కృషికి, సత్యం, ధర్మంతో ఎలాంటి సంబంధం లేకుండాపోయింది.

## దివ్యఖుర్‌ఆన్-జాతుల సమీక్షాధ్యయనం

ఖుర్‌ఆన్ కేవలం సిద్ధాంతాలు, విశ్వాసాలు, చట్టాలకు సంబంధించిన గ్రంథమే కాదు. ఇంకా ఇందులో కేవలం కొన్ని సిద్ధాంతాలు, విశ్వాసాలే వివరించబడి వాటినే అనుసరించండి అని చెప్పబడలేదు. దివ్యఖుర్‌ఆన్ ఈ ప్రత్యేకతలకు తోడు, జాతుల (Nations) ఆలోచన, ఆచరణా తీరుల్ని పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయదగ్గ గ్రంథం. సద్విమర్శ, పరిశీలనతోనే ఈ గ్రంథం ప్రారంభించబడింది. ఈ గ్రంథంలో, దాని అవతరణ కాలంనాటి జాతులు, అంతకు పూర్వం గతించిన ఎన్నో జాతుల పరిస్థితుల్ని ప్రస్ఫుటంగా పరిశీలనకు పెట్టడం జరిగింది. వారి ఆలోచనలు, ఆచరణలపై నిష్పాక్షికమైన విమర్శ చేయడం జరిగింది. ఈ విమర్శల ద్వారా పాఠకుణ్ణి వాస్తవ ప్రపంచంలోకి తెచ్చి సత్యాన్ని పరిచయం చేసిందీ గ్రంథం. ఈ విమర్శనాత్మకమైన సమీక్ష ఫలితంగా సత్యం అన్ని రకాల అనుమానాలకు చిక్కులకు అతీతంగా వెలికివస్తుంది. ఇలా, జాతులు, సమాజాల పరిశీలనాత్మకమైన అధ్యయనం వల్ల తేటతెల్లంగా, హేతుబద్ధంగా బయటబడిన సత్యాలను ఈ గ్రంథం చివరి అధ్యాయాల్లో మనసుకు హత్తుకునే విధంగా సరళమైన శైలిలో విడమర్చి చెప్పడం జరిగింది. ఈ విధంగా పూర్తి ఖుర్‌ఆన్ గ్రంథమే మహోన్నతమైన శాస్త్రీయ శైలిపై సంగ్రహించబడిన గ్రంథం అని తెలుస్తోంది.

దివ్యఖుర్‌ఆన్‌లో చెప్పబడ్డ ఈ సమీక్ష విమర్శల పద్ధతిలో, మనం ఏ జాతికి సంబంధించిన ఆలోచననైనా, ఆచరణలనైనా సంగ్రహించవచ్చు. ఇలా సరైన ఫలితాల వరకు చేరడం మనకు అంత కష్టంగా ఉండదు. నిజం చెప్పాలంటే, పురాతన మతగ్రంథాల నుంచి సరైన భాష్యాలు చెప్పేది ఆ మతగ్రంథాల్ని విశ్వసించే వారు కాదు. వాటి సరైన వివరణలు చెప్పగలవారు కేవలం ఖుర్‌ఆన్ గ్రంథం పొందివున్నవారే. ఎందుకంటే వారివద్ద గల ఈ వెలుగు ద్వారా ఎలాంటి శంక, అనుమానం లేకుండా, ఆ మత గ్రంథాల్ని అధ్యయనం చేసి వాటిలో సత్యం ఎంత మటుకు ఉంది, ఎంత వరకు సత్యానికి సంబంధంలేని విషయాలు అందులో ఉన్నాయి అని చెప్పగలరు. దివ్యఖుర్‌ఆన్ మనకు ఓ వైపు రుజుమార్గాన్ని చూపిస్తూనే మరోవైపు వ్యాప్తిలో ఉన్న సిద్ధాంతాలను, ఆచరణలలోని పరస్పర విభేదాల గురించి కూడా ప్రజల నడుమ తీర్పునిస్తోంది. అంతేకాకుండా అది, ఒకే జాతికి, సమాజానికి చెందిన వారి నడుమ ఏర్పడ్డ పరస్పర వ్యతిరేకమైన ఆలోచనలు, సిద్ధాంతాల గురించి కూడా సరైన తీర్పునివ్వగలదు.

ఖుర్‌ఆన్‌కు మరో పేరు 'ఫుర్కాన్' అని కూడా ఉంది. అంటే సత్యాసత్యాలను సునాయాసంగా పరీక్షించి చూడగల గీటురాయి అన్నమాట.

ఈ విషయంలో ఏ జాతులైనా దారితప్పి అపమార్గంలో ఎంతదూరం వెళ్ళిపోయినా, తమ మతగ్రంథాల్లో ఎలాంటి మార్పులు చేర్పులు చేసుకున్నా, ఆ గ్రంథాల్లో ఇంకా సత్యానికి సంబంధించిన అనేక సూచనలు మిగిలే ఉంటాయి అన్నది ఇక్కడ గమనార్హం.

ఈ సూచనల ద్వారా ఆ జాతిని తిరిగి సత్యం వైపునకు మరల్చవచ్చు. ఓ జాతి ఎక్కడ, ఎలా సత్యాన్ని విస్మరించిందో అన్న విషయాన్ని సులభంగా చూపించవచ్చు.

అప్పుడప్పుడు ఓ భాషలోని ఒకే ఒక పదం ఎన్నో రహస్యాలను ఆశ్చర్యం గొలిపే రీతిలో బయటపెట్టేస్తుంది. అలాంటి ఉదాహరణలను కొన్నింటిని మేమిక్కడ చూపదలిచాం.

'శ్మశానం' అనేది సంస్కృత పదం. హిందువులు తమ శవాల్ని ఎక్కడైతే దహనం చేస్తారో దాన్నే శ్మశానం అని అంటాం. శ్మశానం అనేది నిజంగా శవాలను కాల్చే ప్రదేశం కాదు. ఖననం చేసే ప్రదేశం. 'యాసిక్' అనే ఆయన తన 'నిరుక్తం'

అనే గ్రంథంలో 'శ్మశానం' అనే పదానికి మూలార్థం 'శరీరం పడుకునే స్థలం' అని రాశాడు. ఆచార్య క్షితిజ మోహన సేన్ కూడా తన గ్రంథం 'భారతీయ సంస్కృతి'లో ఈ పదం మూలార్థం ప్రకారం 'శ్మశానం శవాలను దహనం చేసే ప్రదేశం కాక పూడ్చిపెట్టే స్థలం' అని రాశారు. ఈ పదం గురించి తన అభిప్రాయం వెల్లడిస్తూ డా. భోలా నాథ్ తివారి ఇలా రాస్తున్నారు:

"హిందువులు పూర్వం శవాలను దహనం చేసేవారుకారు. ముస్లిములు, క్రైస్తవుల్లా ఖననం చేసేవారు. నేడు మతనాయకులు, ఇతర ప్రాతిపదికలపై, ఆర్యులు పూర్వం శవాలను ఖననం చేసేవారు అన్న నిర్ణయానికే వచ్చారు. శవాలను కాల్చే సంప్రదాయాన్ని వారు ఆర్యేతరుల నుండి ఆ తరువాత నేర్చుకున్నదే."
(శబ్దాల జీవనం: పేజి. 36)

వేదాల నుండి కూడా శవాలను పూడ్చిపెట్టే ఆధారం మనకు లభిస్తోంది. కాబట్టి, శవాన్ని ఖననం చేసేటప్పుడు చదవబడే మంత్రాల్లో ఈ మంత్రం కూడా ఉంది. ఈ శ్లోకం అర్థం ఇది:

"నీవిప్పుడు చూస్తున్నావు. కాని తిరిగి ఈ సూర్యుని వెలుగును చూడలేవు. ఓ భూమీ! తల్లి తన పిల్లవాడి చుట్టూ ఎలా వస్త్రాన్ని కప్పివేస్తుందో నీవు కూడా ఈ శవాన్ని నీలో చుట్టుకో." (అధర్వణ వేదం: 18-2-50)

మరో ఉదాహరణ: సంస్కృత పదం 'గోఘ్నం' గురించినది. దీని అర్థం అతిథి అని. ఇది రెండు పదాలు. 'గో' అంటే గోవు లేక ఆవు, 'ఘ్నం' అంటే 'చంపడం'తో ఏర్పడ్డ పదం. 'పద్యచంద్రకోశం'లో దీనికి 'గౌర్హన్యతేయస్మై' అని చెప్పబడింది. అంటే ఎవరి కోసమైతే గోవు చంపబడుతుందో అని. దీని ద్వారా తెలిసిందేమిటంటే పూర్వకాలంలో భారతదేశంలో అతిథి సత్కారాలు ఆవులను కోసి చేసేవారు అన్న విషయం. తరువాతి సాహిత్యంలో గోవు కోసం 'అఘ్న్యా' అనే పదం వాడబడింది. ఆ పదం అర్థం ప్రకారం చంపబడనటువంటిది అనే అర్థం వస్తుంది. స్వయంగా 'అఘ్న్యా' అనే పదం, పూర్వం గోవు 'ఘ్న్యా'యే అన్న సంజ్ఞను తెలియజేస్తోంది. ఈ విషయంలో డా. భోలానాథ తివారి తన 'శబ్దాల జీవనం' అనే గ్రంథంలో తన అభిప్రాయాన్ని ఈ విధంగా వెలిబుచ్చారు.

"ఆ రెండు పదాల ద్వారా చెప్పబడ్డ విషయం ప్రాతిపదికగా, మొదట ప్రజలు గోమాంసాన్ని తినేవారని, ప్రత్యేకంగా అతిథుల రాకపై వాళ్ళను

గోమాంసంతో ఆహ్వానించేవారనేది అవగతం అవుతుంది. ఈ కారణంగానే అతిథికి పర్యాయపదం 'గోఘ్నం' అయింది."

అదే గ్రంథంలో ఆయన మరోచోట ఇలా రాశారు:

"గోఘ్న' మరియు 'అఘ్న్యా' అనే పదాలు మన పురాతన సభ్యత గురించి విచిత్రమైన విషయాన్ని వెల్లడిస్తున్నాయి. అతిథి మర్యాదల కోసం తరచు 'మహోక్షం' అంటే ఆబోతులు చంపబడేవి అన్న దాఖలాలు లభిస్తాయి. దానికి తోడు విజ్ఞానవంతుడైన కుమారుణ్ణి పొందేందుకు ప్రజలు నెయ్యితో గోమాంసాన్ని లేక గొర్రె మాంసాన్ని భుజించేవారు." (శబ్దాల జీవనం: పేజి. 33-35)

మరో ఉదాహరణ: 'పుత్రః' అనే సంస్కృత పదం. 'పుత్రః' అంటే పుత్రుడు, కుమారుడు. ఈ పదం 'పుత్' మరియు 'త్రై' అనే పదాల సంధి వల్ల ఏర్పడింది. 'పుత్' అంటే నరకం (పున్నామ నరకం). 'త్రై' అంటే రక్షించేవాడు, తప్పించేవాడు. కుమారుణ్ణి 'పుత్రః' అనడానికి కారణం, అతడు తన తండ్రిని నరకం నుండి రక్షిస్తాడు. అంటే సంతానం వల్ల ఒనగూడే పెద్ద ప్రయోజనం తండ్రిని నరకం నుండి రక్షించడమే అని చెప్పవచ్చు. దీనివల్ల నరకాగ్ని నుండి విముక్తి లభించాలన్న కోరిక పూర్వం మన భారతావనిలో ఎంత ప్రబలంగా ఉండేదో అన్నది తెలుసుకో వచ్చు.

ఈ ఉదాహరణల ద్వారా అప్పుడప్పుడు ఓ జాతి సిద్ధాంతాలు, నమ్మకాలు, కోరికలు ఏమిటో మనకు బాగా అర్థమవుతాయి. ఆ ఒక్క పదమే నిరాకరించలేని గట్టి హేతువుగా మారుతుంది.

ఒక జాతి ఆలోచనలు, ఆచరణల గురించి దాని మతగ్రంథాల ద్వారా తెలుసుకోవడమే కాకుండా ప్రాచీన వస్తుసామగ్రి ద్వారా, త్రవ్వకాల ద్వారా లభించే అవశేషాల ద్వారా, భాషలు, పురాతన సంప్రదాయాలు, పురాణ గ్రంథాలు, జానపద గేయాలు వగైరాల నుండి కూడా తెలుసుకోగలం.

## ప్రాచీన భారతీయ సంప్రదాయాలు

అంతిమ దైవగ్రంథం అయిన దివ్యఖుర్ఆన్ వెలుగులో మనం భారతదేశానికి సంబంధించిన ప్రాచీన కాలం నాటివి, ఈ ఆధునిక కాలానికి చెందినటువంటివే అయిన సంస్కృతీ సంప్రదాయ పరంపరలను పరిశీలిస్తే వాటిలో

మనకు సత్యానికి సంబంధించిన గుర్తులు, సూచనలు ఎన్నో కానవస్తాయి. వివిధ సంప్రదాయాలు, రీతులు, రకరకాలైన ఆలోచనలు సత్యాన్ని ఎంతగా మార్చివేసినా సత్యానికి సంబంధించిన గుర్తులు పూర్తిగా సమసిపోలేదు.

పరలోక చింతన, ఏకేశ్వరవాద భావన వైపునకు ఆహ్వానించడం ఇస్లామీయ ప్రచారపు ప్రథమాశయం. వివిధ కారణాల వల్ల ఈ పరలోక భావనకు వ్యతిరేకమైన సిద్ధాంతాలు మన భారతావనిలో అభివృద్ధి చెందాయనడంలో సందేహం లేదు. అయితే ఈ పరలోక భావన నేటికీ ఇక్కడి ప్రజల మనోమస్తిష్కాల నుండి వైదొలగిపోలేదన్నది మాత్రం యదార్థం. సైద్ధాంతిక వైరుధ్యాల కారణంగా పరలోక భావన తీవ్రంగా దెబ్బతిన్నది అన్న దానిలోనూ సందేహం లేదు. అయితే ఇక్కడి ప్రజల హృదయ స్పందనలు మాత్రం అవే. కావలసిందల్లా పరలోక భావన గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని, దాని సత్యసంధతను, ప్రజల అనుమానాల్ని తీర్చే విధంగా వారి ముందుంచడం, తద్వారా వారు పోగొట్టుకున్న తమ సొత్తుగా భావించేటట్లు చేయడం. పరలోక విశ్వాస భావన భారతీయ సంప్రదాయ పరంపరలకు కొత్తదేమీ కాదు. ఈ విశ్వాసమే ఇక్కడి ప్రజల మౌలిక విశ్వాసమని ప్రాచీన కాలం నుండి వస్తున్న విశ్వాసం. సత్యం అనే వెలుగు కాంతిహీనం కావడం వల్ల వివిధ భావాలు, సిద్ధాంతాలు, తత్వజ్ఞానాలు ఇక్కడ అభివృద్ధి చెందాయి. ఇలా ఈ పరలోక భావన అనేది ఈ దేశంలో అణగారిపోవడమేకాక సైద్ధాంతిక వైవిధ్యాల్లో చిక్కుకు పోయిందన్నది వేరే విషయం. సత్యాన్ని గ్రహించినవారు ఈ విషయంలో సరైన పరిశోధన చేసి దారితప్పినవారు ఎక్కడ, ఎలా దారితప్పారో చూపించవలసి ఉంది. అలా చేయడం వారి బాధ్యత కూడా. ఇంకా పరలోక భావన కొరవడిన తరువాత నిజధర్మం ఎలా అంధకారంలోకి వెళ్ళిపోయిందో, తద్వారా నిజధర్మ ప్రభావాలపై, ప్రజల ఆలోచన, ఆచరణలపై ఎలాంటి దుష్ప్రభావం పడిందో చూపెట్టవలసి ఉంది.

నిజ విశ్వాసం నుండి వైదొలగి మనిషి, ఏ నమ్మకాన్నయితే, ఏ సంప్రదాయాన్నయితే అవలంబిస్తాడో అది సత్యం కంటే హీనమైనదే. దాని ప్రభావం వలన మేధ కూడా అధోగతికి జారిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో మనిషి తన కోసం ఏ జీవన తత్వాన్నయితే, మరే జీవన విధానాన్నయితే ఎన్నుకుంటాడో, అందులోనూ ఔన్నత్యం గాని, గొప్పదనంగాని మిగిలి ఉండవు. ఇంకా మనిషి నైజం ఎల్లప్పుడు కోరుకునే మనశ్శాంతి, సంతృప్తి అతనికి లభిస్తుందనే ఆశ కూడా లేదు.

# మనం అన్వేషించే ఆ జీవితం ఏది?

ఇస్లామీయ దృష్టికోణం ప్రకారం, ప్రస్తుతం మనం మనుగడ సాగించే ఈ ప్రపంచం మనిషి అసలు నివాసం కాదు. మనిషి నైజం ఏ ప్రపంచాన్నయితే అన్వేషిస్తోందో అది మరో ప్రపంచం. ఆ లోకంలో మనం కోరుకునే ప్రతి కోరికా నెరవేరాలి. మనిషి నైజం కోరే జీవితం ఎలాంటిదంటే, దానికి అంతం అనేది ఉండకూడదు. అక్కడ లభించే వరాలు ఏ మాత్రం తరగకుండా ఉండాలి. ఆ లోకంలో మనిషి బాధలకు, దుఃఖాలకు ఏ మాత్రం బలి కాకూడదు. తెరమరుగై ఉన్న సత్యం పూర్తిగా మనిషి ముందు ప్రత్యక్షం కావాలి. ఇవన్నీ లభించేదే ఆ మరో ప్రపంచం. ప్రస్తుత జీవితానికి ఇలాంటి ప్రత్యేకతలు ఏ మాత్రం లేవు. ఇక్కడ ప్రతి ప్రాణికి చావు తప్పదు. ఇక్కడి వరాలన్నీ తరిగి అంతం అయిపోయేవే. ఇక్కడ మనిషి నుండి అతని ఆత్మీయులంతా వేరైపోయేవారే. సత్యం కూడా ఇతనితో దాగుడుమూతలాడుతుంది. మొత్తానికి మనిషి కోరికలు, అతని ఆశల స్వప్నాలు సాకారం అయ్యే సూచనలు ఈ లోకంలో అసలే కానరావు.

ఇహలోకంలో మనిషి శక్తిసామర్థ్యాలు పరిమితమైనవి. ఈ పరిమిత శక్తి సామర్థ్యాలతో అతని మనుగడ సాగదు. కాబట్టి మనిషి అత్యుత్తమమైన కోరికలు ఫలించే వీలు ఏదైనా వుంటే అది మరో లోకంలోనే సాధ్యం. ఒకవేళ మరో లోకమే లేకుండాపోతే మనలో ఉత్పన్నమయ్యే అత్యుత్తమమైన కోరికలు, ఆశలన్నిటికి ఏ మాత్రమైనా అర్థం ఉందా? మనలో నిత్యం ఉత్పన్నమయ్యే కోరికలకు అర్థం అంటూ ఉండకపోవడానికి ఎలాంటి కారణం కూడా కనబడదే!

ప్రపంచంలో ఏదీ అర్థరహితంగా లేదు అన్నది మనకు తెలుసు. పుష్పాలు కారణం లేకుండా వికసించవు. గాలులు ఒక లక్ష్యం అంటూ లేకుండా వీచవు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాల భ్రమణంలో దాగి ఉన్న యుక్తి కేవలం కాకతాళీయం, అర్థరహితం అనుకోవడం మన బుద్ధికి, మేధకు వ్యతిరేకం. మనకు ఆకలిదప్పుల బాధ అనేది ఉంటుంది. ఈ ఆకలిదప్పులు అర్థరహితాలైతే, దీని కోసం ప్రకృతి ఆహారపానీయాలను మనకు సమకూర్చిపెట్టేదే కాదు. ఇదే విధంగా మనిషిలో కామవాంఛలు చెలరేగుతాయి. అయితే అవి కూడా అర్థరహితాలే అని అనుకుంటే ఈ వాంఛల పరిపూర్తికి మనిషిని జంటగా సృష్టించబడక పోయేవాడు.

అలాంటప్పుడు స్త్రీ పురుషుల ఉనికే లోపభూయిష్టంగా ఉండేది. ఈ జంట సృష్టి ఏదో ఒక మహోన్నత శక్తి ఉపకారమే. ఏ వస్తువులైతే వేరువేరుగానే ఉంటే పరస్పరం లోతైన సంబంధాలు కలిగి ఉంటాయో, అవి ఎక్కడో తప్పకుండా ఏకం అవుతాయి. దైవం అపారమైన ఇచ్ఛ, జ్ఞానపరిధుల్లో అవన్నీ ఒక్కటే. ఆయనే ఒకరి అవసరాన్ని మరొకరి అవసరంతో ముడివేశాడు.

ఇప్పుడు ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే, ఇక్కడ మనకు భౌతికమైన, మానసికమైన మన అవసరాల పరిపూర్తికి ఇంత అద్భుతమైన ఏర్పాటు ఉన్నప్పుడు, మన అత్యుత్తమమైన భావాలు, కోరికలు ఎలా అర్థరహితాలవుతాయి. ఆ భావాలుగాని, కోరికలుగాని మనలో సహజంగా కావాలని కలిగినవికావు. మనకు ఉనికినిచ్చిన ఆ సృష్టికర్త మనలో పొందుపరిచినవి. కాబట్టి ఈ విషయంలో ఇస్లాం మనకు చేసే మార్గదర్శకమే సరైన మార్గదర్శకం అని ఒప్పుకోక తప్పదు.

ఇస్లాం దృష్టిలో, మనిషికి కలిగే సహజమైన కోరికలన్నీ అర్థవంతమైనవే, ఉద్దేశ్యపూర్వకమైనవే. దేవుడు మనిషిలో సహజంగా ఉండే ప్రతి కోరికను ఈడేరుస్తాడు. మనిషిని, అతని కోరికలకు, అతని సహజ భావావేశాలకు అనుగుణమైన, ఇంకా చెప్పాలంటే అంతకంటే మిన్నయైన మరో ప్రపంచంలో వసింపజేయాలనేదే ఆయన కోరిక. ఇహలోకంలో లభ్యం కానటువంటివన్నీ ఆ మరో ప్రపంచం (పరలోకం)లో లభ్యం అవుతాయి మనిషికి. అంతంలేని జీవితంలో అనంతమైన వరాలు లభిస్తాయతనికి. సత్యాసత్యాలకు సంబంధించిన తీర్పు ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా అక్కడ వెలువడుతుంది. దైవానికి విధేయులై ఉండే దాసులు అక్కడ పొందే వరాలు వారు కోరుకున్న దానికంటే ఎన్నో రెట్లు అధికంగా ఉంటాయి. అయితే అన్యాయపరులైన వారి జీవితం అక్కడ పశ్చాత్తాపానికి గురై కృశించి భయంకరమైన శిక్షగా రూపుదాలుస్తుంది.

ప్రస్తుత ప్రపంచం, ఇక్కడి వనరులు, వరాలు, పరలోకం గురించి తెలిపే ఓ చిన్న ఉపమానం లేక ఓ చిన్న తళుకులాంటివే. ఇచ్చట సంబరాల్తో కూడుకొని ఉన్న ఇహలోక జీవితం, యదార్థమైన లోకం మరొకటి ఉన్నది అనే విశ్వాసాన్ని కలుగజేస్తోంది. ఇక్కడి వస్తుసామగ్రి కేవలం వస్తుసామగ్రే కాదు, తద్వారా మనం మరో జీవితం గురించి అనుభవం గడిస్తాం. ఈ అనుభవం ఎంత చిన్నదైనా, ఎంత తేలికైనదైనా దాని ప్రాముఖ్యతను మనం నిరాకరించలేం.

# నమ్మడానికి రెండు మార్గాలు

ఓ విషయాన్ని రెండు పద్ధతుల్లో నమ్మవచ్చు. మొదటిది, ఆ విషయం గురించి హేతుబద్ధమైన ఆధారాలను చూపెట్టి అది సంభవమే లేక సరైనదే అని చూపెట్టడం. రెండో పద్ధతి ఏమిటంటే, దాని పోలికలు కొన్నిటిని (Samples, Specimens) ముందుంచడం. Sample లేక Specimens కు నిర్వచనం ఇలా ఉంది: "A Portion or part of any thing to show the kind and quality of the whole." అంటే ఓ వస్తువు పూర్తి నాణ్యతను, తీరును తెలిపే ఓ అంశం లేక భాగం అని అర్థం.

జ్ఞానేంద్రియాలకు తట్టే ఈ Specimens వల్ల కలిగే నమ్మకం, స్థిమితం పసలేని ఆధారాల ద్వారా కలుగనేరదు. హేతువు కేవలం ఓ యదార్థాన్ని మాత్రమే అవగతం చేస్తుంది. కాని యదార్థమైన Specimens చూసి దాన్ని అనుభవిస్తాడు మనిషి. హేతువు ద్వారా ప్రేమ గురించి తెలుసుకోవడంలోను, స్వయంగా ఆ ప్రేమలోపడడంలోను ఉన్న ఏ తేడా అయితే ఉందో ఆ తేడా ఇక్కడ కూడా ఉంది.

ఓ యదార్థాన్ని ధృవపరచడానికి, దివ్యఖుర్ఆన్ కేవలం హేతువు పైన్నే ఆధారపడలేదు. అది దాని కోసం, పైన చెప్పిన రెండో పద్ధతిని అవలంబించింది. ఈ విషయంలో అది సజీవమైన మచ్చుతునకలను మన ముందుంచుతుంది. వాటినే ఈ గ్రంథం 'ఆయత్' సూచనలు అని నామకరణం చేసింది.

ఖుర్ఆన్ ఏకేశ్వరవాదం, పరలోకం అనే మహోన్నత యదార్థాల్ని చూపేందుకు హేతువుకు తోడు ఈ విశ్వంలో ఉన్న అనేక నిదర్శనాల్ని, స్వయంగా మానవ జీవితంలోని అనేక నిజాలను, సూచనలను కూడా చూయించింది. ఈ ఆయత్‌లను లేక సూచనలను కళ్ళు తెరిచి వీక్షించిన తరువాత, ఏ యదార్థాల గురించయితే ఖుర్ఆన్ చెబుతోందో వాటిని తిరస్కరించడం అంటే పూర్తి విశ్వాన్ని, ఈ ప్రకృతిని, స్వయంగా మన ఉనికినే తిరస్కరించినట్లు అని గట్టిగా చెప్పగలం. జీవితం, ప్రకృతి అనే అందమైన దర్పణంలో దివ్యఖుర్ఆన్, జీవితానికి సంబంధించిన యదార్థాలన్నిటిని ప్రతిబింబింపజేసింది. అయినా అటు వైపు దృష్టి సారించనివాడు, దాని గురించి అర్థం చేసుకోనివాడు సజీవుడు కాడు, నిర్జీవుడు అంటుంది ఈ గ్రంథం. అతని హృదయం ఏ మాత్రం స్పందించడం లేదు.

అతడు కళ్ళుండి కూడా అంధుడేనని, చెవులుండి కూడా చెవిటివాడేనని అంటోంది. యదార్థాన్ని పొందడానికి మనిషిలో జీవం అనేది ఉండాలి. సత్యాన్ని తిరస్కరిస్తున్నాడంటే నిజంగా అతనిలో జీవం లేనట్లే. అంటే జీవచ్ఛవం అన్నమాట. విడమర్చి చెప్పాలంటే అతను బ్రతికుండి కూడా చచ్చినవానితో సమానం. అటువంటి వారు బుద్ధిపరంగా పశుస్థాయిలో జీవనం సాగిస్తున్నారన్న మాట. జీవం ఉన్నవాళ్ళే ఆ సత్యాన్ని గ్రహించగలరు. దీన్నే దివ్యఖుర్‌ఆన్ ఇలా అంటోంది:

**"ఇన్ హువ ఇల్లా జిక్‌రున్ వ ఖుర్‌ఆనుమ్ ముబీన్. లి యున్‌జిర మన్‌కాన హయ్యన్ వ యహిఖ్ఖల్ ఖౌలు అలల్ కాఫిరీన్" (ఖుర్‌ఆన్-36:69-70)**

(ఇదొక హితోపదేశం. సజీవంగా ఉండే ప్రతి మనిషినీ హెచ్చరించడం, తిరస్కరించేవారికి వ్యతిరేకంగా సాక్ష్యం ఏర్పరచడం దీని లక్ష్యాలు.)

## పరలోక వాదానికి వ్యతిరేకమైన నమ్మకాలు, సిద్ధాంతాలు

పరలోక వాదానికి వ్యతిరేకమైన ఏ సిద్ధాంతాలైతే ప్రపంచంలో ఉన్నాయో, వాటిలో ఓ సిద్ధాంతాన్ని భౌతికవాదులు బలపరుస్తున్నారు. ఆ సిద్ధాంతం ఇది:

"ప్రస్తుత ప్రపంచ జీవితమే అసలైన జీవితం; ఎదురు చూసేందుకు మరే జీవితం లేదు. మరణం జీవితాలను శాశ్వతంగా అంతం చేసేస్తుంది. దాని తరువాత ఇంకే జీవితంగాని, లెక్కాపత్రంగాని, స్వర్గం, నరకంగాని లేవు."

**"ఇన్న హాఉలాయి లయఖూలూన్. ఇన్ హియ ఇల్లా మౌతతునల్ ఊలా వమా నహ్‌ను బిమున్‌షరీన్. ఫాతూ బి ఆబాయినా ఇన్‌కున్‌తుమ్ సాదిఖీన్." (దివ్యఖుర్‌ఆన్-44:34-36)**

(వారంటారు, మాకు వచ్చే తొలి మరణం తరువాత మరేమీ లేదు. ఆ తరువాత మమ్మల్ని మళ్ళీ బ్రతికించి లేపడమంటూ జరగదు. ఒకవేళ నీవు చెప్పేది నిజమయితే మా తాత ముత్తాతలను లేపుకురా.)

ఇలా మాట్లాడేవారు కొంచెం స్థిమితంగా ఆలోచించనేలేదు. వారే గనక అలా ఆలోచిస్తే, తాము చేస్తున్న పొరపాటు ఏదో వారికి అర్థమైపోయేది. మరే ఇతర జీవితం సాధ్యం కానప్పుడు ప్రస్తుతం వీరు అనుభవిస్తున్న ఈ జీవితం వారికి ఎలా సాధ్యం అయింది అనే విషయాన్ని వారు ఏమాత్రం గుర్తించడం లేదు.

కొందరు పరలోకాన్నయితే నమ్ముతారు; స్వర్గనరకాలనుసైతం ఒప్పుకుంటారు. కాని దానికి తోడు వారు చెప్పేదాని గురించి ఆలోచిస్తే, పరలోక విశ్వాసానికే అర్థం లేకుండాపోతుంది. ఉదాహరణకు, దైవం తన ఏకైక కుమారుడికి శిలువపై మరణమిచ్చి మనిషి పాపాలకు ప్రాయశ్చిత్తం చేశాడు అంటారు వారు. తాము చేసే పాపాల దుష్పరిణామాల నుండి రక్షించబడాలంటే మనిషి దైవ కుమారుణ్ణి నమ్మాలంటారు. ఈ సిద్ధాంతం అనేక రకాలుగా హాస్యాస్పదమైనది. దైవానికి, మనిషి పాపాలనే క్షమించాలని ఉంటే దాని కోసం తన కుమారుణ్ణి శిలువ వేయించే అవసరం ఎందుకు? దాని కోసం కుమారునిపై విశ్వాసమే సరిపోయేది కదా!

ఇదే విధంగా, పరలోకంలో ఎదురయ్యే కష్టనష్టాలను కడతేర్చడానికి కొందరు మహాత్ములు ఉన్నారు. వారక్కడ దైవంతో గట్టిగా వాదించి తమ సిఫారసు ద్వారా మనలను గట్టెక్కిస్తారు అని అంటారు కొందరు. ఇలాంటి సిఫార్సులతో అక్కడ పని జరిగిపోతే ఈ ప్రపంచ నిర్మాణమే అవసరం అయ్యేది కాదు. మనిషి ఈ పరీక్షకు గురికావలసిన అవసరం ఎందుకు ఏర్పడింది? ఓ వైపు, మనిషి తన శక్తి సామర్థ్యాలు, తన విశ్వసనీయత గురించి ఎందుకు పరీక్ష ఇవ్వవలసి వచ్చింది? మరో వైపు అతడు జీవితంలోని వివిధ విషయాల్లో అనేక కష్టానష్టాలకు ఎందుకు గురికావలసి వచ్చింది??? కాబట్టి పై ప్రశ్నలకు సమాధానంగా తెలిసిందేమిటంటే ఈ కష్టాలు, ఈ కడగండ్లు మనిషి శీలనిర్మాణానికి, అతని అభివృద్ధి వికాసాలకు తోడ్పడడానికి అవసరం. మనిషి వాటి ద్వారా ప్రయోజనం పొందే బదులు తనను తాను వినాశనానికి గురిచేసుకోవడం, తనకు ఇవ్వబడ్డ ఈ అవకాశాన్ని చేజార్చుకోవడం ఎంత వరకు సబబు అన్నది మరో విషయం.

పరలోకంలో స్వర్గం అన్నది అత్యుత్తమమైన ప్రదేశం. ఈ ప్రదేశం కేవలం చూపులకు మాత్రమే ఉత్తమమైనది కాదు. భావపరంగా, లక్ష్యపరంగానూ అత్యుత్తమమైన ప్రదేశం. స్వర్గానికి అర్హుడవడానికి మనిషి ఏ మార్గం అయితే అవలంబించాలో ఆ మార్గం విశ్వాసమార్గం. కారణం, ఇదే భావపరమైన, లక్ష్యసాధ్యమైన మరియు అర్థవంతమైన మార్గం కాబట్టి. విశ్వాసి అనేది- దాని యదార్థత ప్రకారం- దైవాన్ని గుర్తింపజేసేదే కాదు, ఇది మనిషి, స్వయం తన నైజాన్ని కూడా గుర్తించేందుకు వీలు కలిగించే విషయం. విశ్వాసం అంటే ఏమిటో

తెలియనివాడు తనను తానే గుర్తించుకోలేడు. అతనికి తన పోషకుడు, స్వామి, ప్రభువు ఎవరో కూడా తెలియదు. ఈ పొరపాటు వల్లనే ఈ ప్రపంచం దాన్ని గుర్తించడానికి ససేమిరా ఒప్పుకోవడం లేదు. ఈ యదార్థాన్ని ఒప్పుకోని మనిషి కోసం స్వర్గద్వారాలు ఎన్నడూ తెరచుకోవు. వినాశనం, విచ్ఛిన్నం తప్ప అతడు దేనికీ అర్హుడు కాజాలడు. ఈ దుష్పరిణామాన్నే ఖుర్‌ఆన్ పలుచోట్ల అగ్నితో నిండిన నరకంగా పేర్కొన్నది.

పరలోకాన్ని వ్యతిరేకించే కొందరి నమ్మకాల్లో ఓ నమ్మకం 'పునర్జన్మ' సిద్ధాంతం. ఈ విశ్వాసం లేక సిద్ధాంతం ప్రకారం మనిషి తన కర్మల సత్ఫలితాలను, దుష్ఫలితాలను అనుభవించడానికి ఈ లోకంలోనే పదే పదే జన్మిస్తాడని, తన కర్మల ఫలితంగా ఒకప్పుడు మనిషిగా జన్మిస్తే మరొక్కప్పుడు ఏదో ఒక జంతువుగానో, కీటకంగానో లేక చెట్టుచేమల రూపంలోనో జన్మించి మరల మరల ఈ లోకంలోకే వస్తాడు అన్నది. ఈ సిద్ధాంతం ఓ కాలంలో బాగా ప్రాచుర్యం పొందింది. గ్రీకు, రోమన్లు ఈ సిద్ధాంతాన్ని బాగా నమ్మేవారు. ఈజిప్ట్ ప్రాచీన చరిత్రలోను ఈ విశ్వాసం కానవస్తుంది. వీటి ప్రభావంగా ఓ కాలంలో యూదుల్లోను ఈ నమ్మకం ప్రవేళ్లూనుకుంది. మన భారతదేశంలోని హిందువుల్లోను, జైనుల్లోను, బౌద్ధుల్లోను దీనికి మంచి ప్రాచుర్యం లభించింది.

ఈ పునర్జన్మ సిద్ధాంతానికి సంబంధించిన ఆలోచనలు, నమ్మకాలన్నిటిని, ఆధునిక విజ్ఞాన శాస్త్రం, జీవితం గురించి నేడు తెలుసుకున్న యదార్థాలు పూర్తిగా కొట్టిపారేశాయి.

ఈ సిద్ధాంతాన్ని మనం, విజ్ఞానం, తర్కం వెలుగులో సమీక్షిస్తే ఇది కేవలం ఓ అసత్యమైన నమ్మకం లేక సిద్ధాంతం అని చెప్పడంలో సందేహం ఏమాత్రం ఉండదు.

పునర్జన్మ సిద్ధాంతం పరలోక సిద్ధాంతానికి వ్యతిరేకమే కాదు, దీనివల్ల మతానికి, మత భావాలకు కూడా తీవ్రమైన విఘాతం కలుగుతుంది. ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో పెడితే నాగరికులు, విద్యావంతులు అనబడే వారి దృష్టిలో దీనికి ఎలాంటి విలువే ఉండదు. మతం ఓ శక్తిగా మారి అది పైకొచ్చే మార్గాలన్నీ మూసివేయ బడతాయి. ఈ సిద్ధాంతాన్ని నమ్మేవారు సైతం దీన్ని తమ ఆచరణలో పెట్టకుండా దూరంగానే ఉంచుతున్నారు. దాన్ని తమ నిజజీవితంలో ఆచరించడం లేదు, ఆచరించనూ లేరు.

పునర్జన్మ విశ్వాసంలో సాధారణ ప్రజలకు ఎంతో కొంత ఆసక్తి, ఆకర్షణ ఉండడానికి కారణం, కేవలం ఈ విశ్వాసం ద్వారా మనిషి సంబంధం తన జన్మభూమి నుండి తెగిపోకుండా ఉండడమే; అతడు మరణించిన తరువాత కూడా ఏదో ఒక రూపంలో ఈ ప్రపంచంతో సంబంధం కలిగి ఉంటాడన్న భావమే. ఈ ధరిత్రి ఎడల అతనికున్న అనురాగం, మమకారం, ప్రేమ అతణ్ణి జరుగబోయేదాని గురించి ఆలోచించే అవకాశమే ఇవ్వవు. అసలు జీవితం పరిమితమైన ఈ ప్రపంచం కంటే అనేక రెట్లు అధికమని తెలిస్తే ఎంత బాగుంటుంది!

పునర్జన్మ సిద్ధాంతం గురించి సహేతుకమైన, ఆచరణయోగ్యమైన దృష్టికోణాలతో సమగ్రంగా పరిశీలించే అవకాశం ఇక్కడ లేకపోయినా ఓ మౌలిక విషయం వైపు మాత్రం దృష్టిని మళ్ళించే ప్రయత్నం చేస్తాను. జంతు, వృక్షశాస్త్ర అధ్యయనం వల్ల మనకు తెలిసేదేమిటంటే, వృక్ష సంతతి మాట అటుంచి కేవలం జంతుజాలాలు, మనిషి నడుమ ఉన్న వ్యత్యాసమే భర్తీచేయ వీలులేనటువంటిదని, వృక్ష సంతతి మరియు జంతు సంతతిలో స్పృహ (Self Conciousness) అనేదే లేదు అని తెలుస్తోంది. తన గురించి తాను అర్థం చేసుకునే స్పృహ కేవలం మనిషిలోనే ఉంది. ఏ జంతువులోనో, ఏ చెట్టులోనో మనిషి ఆత్మ ఉంటుంది అనుకోవడానికి ఎలాంటి ఆధారం కానరాదు. అయితే, మనిషి ఆత్మ, తాను జంతువు రూపంలోనో, చెట్టుచేమల రూపంలోనో ఉన్నానని, తాను చేసిన దుష్కృత్యాలకు ఫలితం ఇలా ఈ రూపంలో లభిస్తుందని ఎలా తెలుసుకోగలరు?

మనిషి ఆత్మ, స్పృహరహితమైన జంతువు లేక వృక్షం ఆత్మగా మార్చబడి శిక్షించబడుతోంది అని ఏ ప్రబుద్ధుడైనా అంటే, మనిషి ఆత్మ, జంతువు ఆత్మకు ఉన్న తేడా ప్రకారం, ఓ మనిషి ఆత్మ, జంతువు ఆత్మగా మార్చబడితే మొదట దానికి ఉన్న వ్యక్తిత్వంగాని, శక్తిగాని దానికి ఉండదు అని అతడు గ్రహించాలి. ఇలా జరిగినప్పుడు మరో ఆత్మ ఉనికిలోనికి వస్తుంది. ఆ వ్యక్తిత్వంగాని, ఆ ఆత్మగాని ఉండకపోతే శిక్షించబడేదెవరు? చెట్లు, జంతువులు వగైరాలు పూర్వజన్మ దుష్కృతం వల్ల శిక్షల రూపంలో ఉనికిలోనికి వచ్చాయి అని మనం ఒప్పుకున్నా ఆ శిక్ష మానవాత్మలకు కాదు, శిక్షకు అర్హులు కానటువంటి ఇతర అమాయక ఆత్మలకు లభిస్తోంది. ఈ చెట్టుచేమలు, జంతుజాలం మనిషికి గొప్ప వరాలు. అవి పాపాల

ఫలితంగానే ఉనికిలోనికి వచ్చాయి అని అనడం, వాటిపై అభాండాలు వేసి అత్యాచారం చేసినట్లే. పాప ఫలితంగా మనకు ఈ వరాలు లభిస్తాయి అని అనుకుంటే ఈ పాపం మానవత్వానికి, మానవ జాతికి ఎంతో అవసరం అని అనక తప్పదు. సరికదా మానవ మనుగడ, ప్రపంచ అందచందాలు ఈ పాపాల ఫలితంగానే సాగుతున్నాయని కూడా చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో, మన హృదయాల్లో దైవం కోసం రవ్వంత కృతజ్ఞతాభావం కూడా పొడసూపదు. మనం ఈ ప్రపంచాన్ని, ఇక్కడి వరాలను వనరుల్ని మరో దృష్టితో చూడాల్సి వస్తుంది. పేదసాదల్ని, కష్టాల్లో కడగండ్లలో జీవితం నెట్టుకువచ్చేవారిని, పాపాత్ములని, వీళ్ళు పాపాత్ములు కాకపోతే వీరికి ఈ స్థితి దాపురించేదే కాదు అని అనుకోవలసివచ్చేది మనం.

పునర్జన్మ సిద్ధాంతం వేద బోధనలకు కూడా వ్యతిరేకమే. వేదాల్ని అధ్యయనం చేస్తే, ఆర్యులు పరలోకాన్ని నమ్మేవారని తెలుస్తోంది. వారి విశ్వాసం ప్రకారం మరణానంతరం మనిషికి మరో జీవితం లభిస్తుందని, అది మనిషి కర్మలకు అనుగుణంగా మేలైనదైనా, కీడైనదైనా అయివుండవచ్చు.

'మంత్రం' మరియు 'బ్రాహ్మణా'ల్లోను 'పితృలోక' విశ్వాసం ఉంది. ఆ విశ్వాసంలో పునర్జన్మకు తావేలేదు. ఆ తరువాతి 'సూత్ర'కాలంలో, పితృలోక విశ్వాసానికి తోడు పునర్జన్మ సిద్ధాంతం కూడా చోటుచేసుకుంది. ఆ తరువాత పురాణ కాలం నాటికి పితృలోక విశ్వాసంతోపాటు పునర్జన్మ విశ్వాసం చెరిసమంగా మనకు కానవస్తాయి. వేదాలు పునర్జన్మను నమ్మవు. ఇది యదార్థం. ఎవరైతే వేదాల నుండి పునర్జన్మ సిద్ధాంతాన్ని రుజువు చేయడానికి ప్రయత్నం చేస్తారో, వారు న్యాయంగా వ్యవహరించరు. కొందరైతే ఖుర్ఆన్ నుండి కూడా పునర్జన్మ సిద్ధాంతాన్ని సాధించే ప్రయత్నం చేశారు. కాని వారి ఈ ప్రయత్నాలకు సత్యంతో ఎలాంటి సంబంధం లేదు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తన గ్రంథం, "ఇండియన్ ఫిలాసఫీ" సంపుటం-1లోని 113-116 పేజీల్లో, వేదాల్లో పునర్జన్మ సిద్ధాంతం లభించదు అని రాశారు. ఇలాగే అనేక మంది హిందూ విద్వాంసుల భావం కూడా అదే. ప్రాచ్యమతాల ప్రఖ్యాత అధ్యయనకర్త 'మాక్సుముల్లర్' వేదాలను అధ్యయనం చేసిన తరువాత, "వేదాల్లో పునర్జన్మ సిద్ధాంతం అనేదే లేదు అందు పరలోకవాదమే లభిస్తుంది" అని రాశాడు.

వేదాల్లో ఇలా ఉంది:

"వారు పరలోకాన్ని మరచి, బుద్ధిజ్ఞానాలను వదిలేసి మాచే నిర్ణయించబడ్డ హద్దులను దాటే ప్రయత్నం చేస్తున్నారు." (రుగ్వేదం-1:3-4)

"గుర్రానికి ప్రతిదినం గడ్డి ఎలా కేటాయించబడుతుందో ఓ అగ్నీ! ధనాన్ని (కూడగట్టి) భద్రపరిచే వారి నుండి అంతిమ దినం నాడు నేను లెఖ్ఖ గైకొంటాను." (యజుర్వేదం-50: 11-75)

సత్యార్థ విద్యాలంకార్ ఇలా రాశారు:

"వేదాల్లో పునర్జన్మ సిద్ధాంతం లేదు. ఈ విషయం గురించి నేను జూదం కూడా ఆడగలను (బెట్టుకాస్తాను)." (పునర్జన్మ: పేజి. 104)

డా. పరాడా చౌహాన్ ఇలా రాశారు:

"వేదాల్లో పునర్జన్మ గురించి ఉంది. అయితే అందులో ఈ జన్మ తరువాత కేవలం ఒకే ఒక జన్మ గురించి రాసుంది. వేలాది జన్మల గురించి కాదు." (పునర్జన్మ మరియు వేదాలు: పేజి. 93)

వేదాల్లో ఇలా ఉంది:

"అగ్ని యొక్క ప్రాముఖ్యతను తెలుసుకునేందుకు సూర్యుణ్ణి పొందే ప్రయత్నం చేయండి. మాతరిశ్వుడు, భృగుడు అనేవాళ్ళు మా ద్వారానే రెండు జన్మలను తెలుసుకొని నమ్మారు." (రుగ్వేదం:1-11-1)

మరణానంతర జీవితం గురించి ఖుర్ఆన్ ఇచ్చిన ప్రస్ఫుటమైన విశ్వాసం ప్రకారం, పై వేదమంత్రాలు సత్యం అనడంలో ఎలాంటి సందేహం లేదు. తత్సంబంధమైన ఊహాగానాలకు బదులు దైవవాణి ద్వారానే ఈ విశ్వాసాన్ని అర్థం చేసుకోవచ్చు. దివ్యఖుర్ఆన్ తన అనేక ప్రత్యేకతలకు తోడు 'అల్ముహైమిన్' కూడా అంటే గతించిన సర్వసత్యబోధనలను తనలో నిక్షిప్తం చేసుకున్న గ్రంథం అని అర్థం. ఎవరైతే ఖుర్ఆన్‌ను అధ్యయనం చేస్తారో వారు సకల ఆకాశ గ్రంథాలను (దైవగ్రంథాలను), సర్వప్రవక్తల మౌలిక బోధనలను అధ్యయనం చేసినట్లే. మౌలికంగా, ఖుర్ఆన్ మరే క్రొత్త సిద్ధాంతంతోగాని, మరే ఇతర క్రొత్త సందేశంతో గాని అవతరించలేదు. ఈ గ్రంథం ఎప్పుడైతే పరలోకాన్ని ధృవపరుస్తోందో,

మరణానంతర జీవితానికి సంబంధించిన మూలసిద్ధాంతం కూడా సకల సత్యధర్మాలకు అదే అయి ఉండింది అని అర్థం చేసుకోవచ్చు. సత్యధర్మం ఎల్లప్పుడు పరలోక విశ్వాసాన్నే బోధించింది అని అనడానికి, గత గ్రంథాల్లో తత్సంబంధమైన ఆధారాలు, బోధనలు లభిస్తాయి. ఇతర నమ్మకాలు, సిద్ధాంతాలన్నీ కేవలం మనుషుల మనోమస్తిష్కాల నుండి వెలువడ్డవే.

## పరలోక విశ్వాసం-ప్రాచీన భారతదేశం

పరలోక విశ్వాసం సార్వజనీన సిద్ధాంతం. దాన్ని అన్యసిద్ధాంతం లేక భారతీయేతర సిద్ధాంతం అని అనుకోవడం పెద్ద పొరపాటు. ఈ సిద్ధాంతాన్ని నమ్మడం అంటే ఓ భారతీయేతర సిద్ధాంతాన్ని నమ్మడం అని అర్థం కాదు. సత్యం విషయంలో అది భారతదేశానికి సంబంధించిందా లేక భారతదేశానికి ఆవల నుండి వచ్చిందా అని చూడ్డం అనేది అనవసరం. సత్యం ఎక్కడ, ఏ రూపంలో ఉన్నా అది పూర్తిగా మానవాళి ఉమ్మడి సొత్తు.

ప్రస్తుతం జీవితానికి సంబంధించిన ఇతర దృష్టికోణాలను వదిలి మనం కేవలం పరలోక వాదాన్నే తీసుకుని ఈ విషయంలో భారతదేశ సంప్రదాయాలు, సంస్కృతి ఎలా ఉన్నాయో చూద్దాం.

అనేక రుగ్మతలకు, కాలానుగుణమైన మార్పులకు చేర్పులకు గురైనా, పరలోక భావనకు సంబంధించిన ఈ ప్రభావాలు భారతీయ సంస్కృతిపై ఆలోచనలపై ఎలా పడ్డాయి అనేది సమీక్షించి చూపించాల్సి ఉంది. పునర్జన్మ సిద్ధాంతపు ఉనికి కూడా పరలోక విశ్వాసాన్ని రూపుమాపడంలో కృతకృత్యం కాలేకపోయింది. ఇది నిజంగా పరలోక విశ్వాసం, మానవ ప్రకృతికి అనుకూలమైనది అనడానికి ఓ నిదర్శనం. ఇంకా, ప్రాచీన భారతదేశంలో ఈ పరలోక భావన ఎంత లోతుగా వ్రేళ్లూనుకొని ఉండేదో, దాన్ని పూర్తిగా విస్మరించడం ప్రజలకు ఎలా సాధ్యం కాకపోయిందో చెప్పేందుకు కూడా ఓ ఉదాహరణే.

భారతీయ సంప్రదాయాలకు సంబంధించి అధ్యయనం, ఆర్యుల నాగరికత, సభ్యతల వరకు వచ్చి ఆగిపోతుంది. అంతకు పూర్వపు విషయాలను పరిశీలించడం జరుగదు. ఈ విషయంలో కొన్ని అపార్థాలు, మరికొన్ని గందరగోళ పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఆర్యులకు పూర్వం ఇక్కడ మనుగడ సాగించిన జాతుల

గురించిన పరిశోధనలు నామమాత్రంగానే ఉండిపోయాయి. ఆర్యులకు పూర్వముండిన జాతుల భాషలు, వారి చరిత్ర, నాగరికతలను గురించి తెలుసుకునేందుకు మన దగ్గర ఉన్న వనరులు అతి తక్కువ (నామమాత్రమే). అయినా, ఆర్యులకు పూర్వం భారతదేశంలో ద్రవిడ నాగరికత అనే గొప్ప నాగరికత విలసిల్లిందని చెప్పుకోవడం జరుగుతోంది. దాని ప్రభావం ఆ తరువాత వచ్చిన జాతులపై కూడా పడింది. ఆశ్చర్యం ఏమిటంటే, ఈ ద్రవిడ నాగరికతల సంబంధం, ఈజిప్ట్, బాబిలోనియా నాగరికతలతో ముడివడి ఉండడం. ఇదే విధంగా 'కోల్' భాషల అధ్యయనం ద్వారా అనేక క్రొత్త యదార్థాలు వెలుగులోకి వచ్చాయి. కోల్ జాతిని ఇప్పటిదాకా ఓ అనాగరిక జాతిగా తలచి కొట్టిపారేయడం జరిగింది. కాని ఆ తరువాతి పరిశోధనలు మన ఈ వైఖరి సరైంది కాదు అని తేల్చి చెప్పాయి. **కోల్** భాష ఆస్ట్రేలియా, ఆసియా ఖండాల్లో వ్యాపించి ఉన్న వివిధ భాషలతో సంబంధంగలిగి ఉందని రుజువవుతుంది. మన పట్టణాలకు సంబంధించిన అనేక పేర్లు కోల్ భాషలోనే ఉన్నాయి. ఇదే కాకుండా మనం ఉపయోగించే అనేక వస్తువుల పేర్లు కూడా కోల్ భాష నుండే గ్రహించబడ్డాయి. ఇదే విధంగా ఆ తరువాత వచ్చిన జాతులు, ఈ సిద్ధాంతాలు, నమ్మకాలు మా స్వంతం అనుకున్నవి కూడా కోల్ జాతికి సంబంధించిన సిద్ధాంతాలు, నమ్మకాలే. అయితే ఈ విషయంలో జరిగిన పరిశోధనలు అతిస్వల్పం. ప్రొఫెసర్ సిల్వాన్ లెవి, ఆయన శిష్యులు చేసిన భాషాపరమైన పరిశోధనల వల్ల కొన్ని రహస్యాలు మాత్రం వెలుగులోకి వచ్చాయి. ఈ విషయంలో మరిన్ని పరిశోధనలు జరిగితే, ఇక్కడి జాతుల సన్మార్గం లేక అపమార్గానికి సంబంధించిన ఎన్నో విషయాలను కనుగొనవచ్చు.

## మరణం అంటే ఏమిటి?

మరణం గురించిన భారతీయ దృక్పథం ఏమిటో ముందు పరిశీలిద్దాం. భారతీయ గ్రంథాలైన వేదాలు, ఉపనిషత్తులు, మహాభారతం, గీత వగైరాలలో మరణంతో జీవితం అంతం కాదని, కేవలం భౌతిక శరీరమే అంతం అవుతుందని, ఆ తరువాత మనిషి తన పూర్తి వ్యక్తిత్వంతో మిగిలి ఉంటాడని చెబుతున్నాయి.

భగవత్‌గీతలో ఇలా ఉంది:

1. య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతం
   ఉభౌతౌన విజానీతో నాయం హంతిన హన్యతే. (గీత-2:19)

అంటే: "ఎవరైతే ఈ ఆత్మను మరణించేది అని అనుకుంటాడో, మరెవరైతే దీన్ని మరణించింది అని నమ్ముతాడో ఆ ఉభయులకు ఏమీ తెలియదు."

2. అవ్యక్తాదీని భూతాని వ్యక్తా మధ్యాని భారత
అవ్యక్త నిధనాన్యేవ తత్రకా పరిదేవనా. (గీత-2:28)

అంటే: "ఓ అర్జునా! ఆత్మలు గల వారంతా పుట్టక మునుపు నిశ్శరీరులు. మరణించిన తరువాత కూడా నిశ్శరీరులుగానే ఉంటారు. కేవలం మధ్యకాలంలోనే శరీరధారులు. ఈ విషయంలో చింతించే విషయం ఏమిటి?"

దీని ద్వారా అర్థం అయింది ఏమిటంటే, ఆత్మ అనేది శాశ్వతమైన ఉనికి కలిగి ఉంటుంది. శరీరం మరణించినా ఆత్మ మరణించదు. అది సజీవంగా మిగిలే ఉంటుంది అన్నదే.

## పితృలోకం

మరణానికి, అంతిమ దినానికి నడుమగల కాలపరిమితిలో మనిషి ఎక్కడ, ఎలా ఉంటాడో అన్న విషయంపై వేదాలు వెలుగును ప్రసరింపజేస్తున్నాయి. ఇందుకోసం వేదాల్లో 'పితృలోకం' అనే భావన లభిస్తోంది. పితృలోకం అంటే మన తండ్రి, తాతముత్తాతలు, ఇంకా ఇతరులు మరణించిన తరువాత చేరే లోకం. వేదాలే కాకుండా పురాణాలు, మహాభారతంలోను పితృలోకం గురించి వివరంగా చెప్పబడింది. కొన్ని ఉదాహరణలు ఇలా ఉన్నాయి.

మరణించినవాణ్ణి సంబోధిస్తూ రుగ్వేదంలో ఇలా చెప్పబడింది:

"పితృలు (తాతముత్తాతలు) కొందరు నెయ్యి వద్ద కూర్చుని ఉన్నారు. వారి కోసం 'తేనె' ప్రవహిస్తోంది. నువ్వు వారి దగ్గరకు వెళ్ళు. తపోఫలం ద్వారా అశ్వరులై తమ ఆరాధనల వల్ల స్వర్గానికి వెళ్ళినవారు, తమ ప్రాణాలను త్యజించిన వారి వద్దకు నీవు వెళ్ళిపో. ఎవరైతే యుద్ధ మైదానాల్లో పోరాడారో, లేక చంపబడ్డారో లేక దానాలిచ్చారో వారి వద్దకు నీవూ వెళ్ళిపో. ఏ పూర్వీకులైతే పుణ్యకార్యాలకు సత్ఫలితాన్ని పొందారో, సత్కర్మలను వ్యాపింపజేశారో, ఎవరైతే కష్టించి ఆరాధనల ప్రతిఫలాన్ని కూడగట్టారో వారి దగ్గరకూ నీవు చేరిపో."

(రుగ్వేద మండలం: 10, సూక్తం- 104)

మహాభారతంలో ఇలా ఉంది:

"షడ్రంధాల (శరీరం) నుండి బయటపడి ఆత్మ తన రంగు, ఆకారం ప్రకారం అదృశ్యమైన (కనబడని) శరీరంలోనికి ప్రవేశిస్తుంది. ఎవరూ ఆ ఆత్మను చూడలేరు. ఆ అష్టావయవాల కనబడని ఆత్మ ఎల్లప్పుడూ చలనము కలిగే ఉంటుంది. అది ఎలాంటి మార్పు వల్లగాని, వినాశనం వల్లగాని అంతం కాదు...... (దుష్టులు) రోదిస్తూ, హాహాకారాలు చేస్తూ, భీతిల్లుతూ, భయం వల్ల కంపిస్తూ, తమ శరీరంపై దెబ్బలు పడుతూ ఉండగా యమరాజు గృహానికి వెళతారు."

(పేజి. 370)

"ప్రపంచంలో మనుషులు తమ కర్మలకనుగుణంగా మూడు రకాలు...... మూడు మార్గాలు, ఉన్నతులు, నీచులు, మధ్యముల కోసం. పవిత్రులు, నగుమోములను యమదూతలు ఎలా తీసుకువెడతారు? వినండి. యమదూతలు మేలైన వస్త్రాలు ధరించి (ఉత్తముల్ని) హాయిని గొలిపే మంచి మార్గాల (రాచబాటల) ద్వారా గౌరవంగా తీసుకొని వెడతారు. యమదూతలు సైనికుల రూపంలో మధ్యముల్ని మధ్యమార్గం ద్వారా గొనిపోతారు. యమదూతలు చండాలుర రూపంలో నీచుల్ని పట్టి హూంకరిస్తూ, త్రాళ్ళతో బంధించి కఠినాతి కఠినమైన మార్గం ద్వారా ఈడ్చుకొని పోతారు. యముడు, వచ్చిన పుణ్యాత్ములను తన హృదయానికి హత్తుకొని ఆహ్వానించి వారి యోగక్షేమాలు అడుగుతాడు. వారి పుణ్యకార్యాలను పొగిడి వారికి విడిదిని ఏర్పాటు చేస్తాడు. పుణ్యాత్ములు యముని అనుమతి పొంది స్వర్గంలో ప్రవేశిస్తారు." (పేజి. 45, 226, 227)

గరుడ పురాణంలో ఇలా ఉంది:

".... మరణించినవాడు ఇలా ఆలోచిస్తూ, తనను తాను సంబాళించుకుంటూ ఎనభైనాల్గు యోజనాల పొడవు, ఎనభైనాల్గు యోజనాల వెడల్పుగల ధర్మరాజపురికి చేరుకుంటాడు. ధగద్ధగాయమానంగా వెలిగిపోయే ధర్మరాజపురం (యమరాజపురం) గాయకులు, అప్సరసలతో నిండి ఉంది. ఎనభైనాల్గు లక్షల నరకాలు (కూడా) అందున్నాయి. పదముగ్గురు పహరాదారులు యమరాజు ఎదురుగా నిలబడి ఉంటారు. వారు ఎంతో విజ్ఞతతో పాపపుణ్యాలను, ప్రజల కర్మలను యమరాజుకు సమర్పిస్తారు. మనిషి ఎవరికీ తెలియకుండా, తెలిసేటట్లూ ఆచరించే ప్రతి కర్మను కూడా ఈ చిత్రగుప్తులు కర్మల రికార్డును

తమ వద్ద ఉంచి యమరాజుకు చూయిస్తారు. చిత్రగుప్తులు ప్రతి విషయాన్ని వింటారు, చూస్తారు కూడా. (గరుడ పురాణం: ప్రేతకల్పం-4:1:22)

యజుర్వేదంలో ఇలా ఉంది:

"యముడు వారి మగసిరిని పోగొట్టడు. వారికి వాహనం లభిస్తుంది. ఆ వాహనం ద్వారా వారు గాలిలో విహరిస్తారు. వారికి దృఢమైన రెక్కలు ఒసగబడతాయి. ఆ రెక్కల సహాయంతో వారు ఆకాశాలకు ఆవల వైపు కూడా ఎగురగలరు. ఆ ప్రదేశంలో వెన్న, తేనె, మధువు, క్షీరం, దధి (పెరుగు) సువాసనలతో కూడిన కాలువలు కూడా ఉన్నాయి." (యజుర్వేదం)

పితృలోకంలో అన్ని విధాల సుఖం, హాయి ఉంటాయి. భోగభాగ్యాలూ ఉన్నాయి. ఈ విషయంలో ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు ఇలా ఘోషిస్తున్నాయి.

"పితృల ఒక సుఖానుభవం ఇక్కడ మనుషుల నూరు సుఖానుభవాలకు సమానం."

చనిపోయినవారెక్కడుంటారు అన్న ప్రశ్నకు వేదాలు ఇచ్చే సమాధానం ప్రకారం అది అంతరిక్షం.

అధర్వణ వేదంలో ఇలా ఉంది:

"అంతరిక్షంలోని మూడో అంతస్తులో పితృలు (తాత తండ్రులు) నివసిస్తారు." (అధర్వణ వేదం: 18-2-48)

సిద్ధాంత శిరోమణిలో ఇలా ఉంది:

"చంద్రుని పైభాగంలో పితృలుంటారు."

యజుర్వేదంలో "ఎవరైతే అగ్నిలో కాల్చబడ్డారో, ఎవరైతే కాల్చబడలేదో మధ్య ఆకాశంలో, తమ మొక్కుబడులు చెల్లించడం ద్వారా సుఖాలను పొందుతున్నారు" అని రాసుంది.(యజుర్వేదం:అధ్యాయం-19, మంత్రం-60)

పై పంక్తుల్లో యముని ప్రస్తావన వచ్చింది. అతడు పితృలోక సంరక్షకుడని వేదాలు, శాస్త్రాల ద్వారా తెలుస్తోంది.

"ఆత్మలు యమలోకంలో లేక యముని రాజ్యంలో ఉంటాయి."
(యజుర్వేదం: అధ్యాయం-19, మంత్రం-45)

'నిరుకం' రచయిత కూడా ఇలా రాశాడు:

"యమ దేవత అంతరిక్షంలో ఉంటాడు. కాబట్టి పితృలంతా ఆయనకు ఆధీనులే. వారు అంతరిక్షవాసులుగా చెప్పబడతారు."

(నిరుక్తం: అధ్యాయం-11, కాండం-18)

మృత్యుదూతలు వేదాల్లో యమదూతలుగా, మృత్యుదూతలుగా చెప్పబడ్డారు. వేదవిశ్వాసం ప్రకారం, మనిషి ప్రాణాన్ని తీసుకొని వెళ్ళేవాడు యమదూత.

"యమదూత ఎంతో విజ్ఞుడు. ఆయన చనిపోయిన మనిషి ఆత్మను పితృలోకానికి 'పితృ'గా మారేందుకు పంపిస్తాడు."

(అధర్వణ వేదం: కాండం- 18, సూక్తం-2, మంత్రం-27)

రుగ్వేదంలో ఇలా చెప్పబడింది:

"యముణ్ణి దర్శించుకో, పెద్దల ఆత్మలతో కలువు. స్వాతంత్ర్యం మరియు పుణ్యకార్యాల ప్రతిఫలాన్ని ఉన్నతమైన స్వర్గంలో పొందు. పాపాలను, దౌష్ట్యాలను పారద్రోలి దేదీప్యమానమైన శరీరాన్ని సంపాదించు."

పితృవు అంటే కేవలం తాతతండ్రులే కాదు, ఇతర బంధువులు-వారు చిన్నవారైనా పెద్దవారైనా- పితృలే అన్నది ఇక్కడ గమనార్హం. కాబట్టి తాత, తండ్రి, తల్లి, సోదరి, భార్య, కుమార్తె, కుమారుడు, సోదరుడు, మనుమడు వగైరాలను కూడా వారితో కలపడం జరిగింది.

పితృలోకాన్ని ఇస్లామీయ (ఖుర్ఆన్) పరిభాషలో 'బర్జఖ్ లోకం' అని అంటారు. అరబిక్ భాషలో రెండు వస్తువుల నడుమగల తెరను లేక చాటును బర్జఖ్ అంటారు. ఉపనిషత్తు పరిభాషలో అది 'సంధ్య.' ఎందుకంటే ఇది ఈ జీవితాన్ని పరలోక జీవితంతో కలుపుతుంది.

ఉపనిషత్తు వాక్యాలు ఇలా ఉన్నాయి:

"ఈ మనిషి కోసం నిశ్చయంగా రెండు లోకాలున్నాయి. ఒకటి ఈ లోకం, రెండోది పరలోకం. మధ్యనున్న మూడోది 'సంధ్య.' అది నిద్రించే ప్రదేశం. ఆ పదేశంలో ఆగి అతడు ఈ రెండు లోకాలను, ఇహలోకాన్ని, పరలోకాన్ని దర్శిస్తూ ఉంటాడు."

(బృహదారణ్యక ఉపనిషద్: అధ్యాయం-4)

కఠోపనిషద్ మరియు షత్పథ బ్రాహ్మణంలో కూడా పితృలోకంలో, ఆత్మ స్వప్నావస్థలో ఉంటుంది అని చెప్పబడింది. ఉపనిషత్తుల ప్రఖ్యాత వ్యాఖ్యాన కర్త అయిన శంకరాచార్యులు, లోకాలు మాత్రం రెండే; ఒకటి ఇహలోకం, రెండోది పరలోకం. మూడో ప్రదేశం సంధ్య మాత్రమే. ఇది నడుమనున్న మజిలి. ఇది రెండు లోకాలకు నడుమనున్న మజిలి అని వ్యాఖ్యానించారు. ఇలా మనకు, భారతీయ మతగ్రంథాలు, ఇక్కడి ప్రాచీన ఆలోచనా పరంపరల్లో మరణానంతర జీవితం గురించి ఎంతో సమాచారం లభిస్తోందని, ఇది ఇస్లామీయ భావనకు ఎంతో చేరువైనది, పునర్జన్మ సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకం అని మనం గమనించగలం.

## పరలోకం

దివ్యఖుర్ఆన్ పరలోకం గురించి ఇలా సెలవిస్తోంది:

"ఓ రోజున ఈ విశ్వవ్యవస్థ అంతా ఛిన్నాభిన్నమైపోతుంది. ఆ తరువాత ప్రపంచం తిరిగి ఉనికిలోనికి వస్తుంది. మరణించిన వారంతా సజీవులై లేస్తారు. వారి కర్మల గురించి, వారి విశ్వాసాల గురించి, సమీక్షించడం జరుగుతుంది. తమ కర్మలకు అనుగుణంగా, తమ విశ్వాసాలకు అనుగుణంగా ప్రజలు స్వర్గంలోనో, నరకంలోనో ప్రవేశిస్తారు."

ప్రస్తుత విశ్వ వ్యవస్థ ఛిన్నాభిన్నం అవడాన్నే దివ్యఖుర్ఆన్, ఖియామత్ (ప్రళయం)గా పేర్కొంది. ప్రళయ గమనానికి సంబంధించిన సూచనను 'ఖుర్ఆన్' మరియు 'బైబిల్' గ్రంథాలేకాకుండా భారతీయ మతగ్రంథాలు కూడా బలపరుస్తున్నాయి. ఉదాహరణకు శ్రీమద్ భాగవతం (4:14-18)లో ప్రస్ఫుటంగా, "ఈ ధరిత్రిగాని, ఈ ఆకాశంగాని మిగిలి ఉండవు, మిగిలి ఉండేది కేవలం బ్రహ్మ ఒక్కడే, ఆ తరువాత పరలోక ఘట్టం ప్రారంభం అవుతుంది" అని చెప్పబడింది.

పరలోక జీవితం, వేదాల ప్రకారం ఎంతో శ్రేష్ఠమైన జీవితం. వేదాలు ఈ జీవితాన్ని 'దివ్య జన్మ'గా చెబుతూ ఈ జీవితం సతతం తన ఇహలోక జీవితంలో దైవాన్ని అంటిపెట్టుకునే వారికే లభిస్తుంది; వారి ఆ జీవిత పవిత్రతకు, ఔన్నత్యానికి గల కారణం, దైవం వారి జీవితాల్లో కలగలసిపోవడమే, ఇది కేవలం పైకి కనిపించే మతాచారాల వల్ల సాధ్యం అయ్యేది కాదు అని అంటాయి.

వేదవాక్యాలు ఇలా ఉన్నాయి:

"దివ్య జన్మ 'హవనం' (యజ్ఞయాగాదులు) చేసే వారి కోసం కాదు. ప్రతి క్షణం దైవాన్ని అనుసరించే వారి కోసమే."

పరలోకం ఓ సంపూర్ణమైన లోకం. అక్కడ మనిషి జాగ్రదావస్థలోనే ఉంటాడు. కఠోపనిషత్తును గురించి వివరిస్తూ, పితృలోకంలో ఆత్మ పరిస్థితి స్వాప్నికమైనది. ఇహలోకంలో ఉన్న అవస్థ జాగ్రదావస్థ అనేది పరలోకంలోనే లభ్యం అవుతుంది అని అంటోంది. పరలోకంలో సన్మార్గులకు స్వర్గం, దుర్మార్గులకు నరకం లభిస్తాయి. వేదాలు 'జన్నత్'ను స్వర్గంగా, 'జహన్నమ్'ను నరకంగా పేర్కొన్నాయి. స్వర్గం నేటి మేధావులు అనబడేవారు కొందరు అనుకున్నట్లు మనిషికి ఇహలోకంలోనే లభించే అనుభూతి మాత్రం కాదు. స్వర్గం అనేది శాశ్వత లోకం. అందుకనే స్వర్గానికి పర్యాయ పదాలైన 'సక్రితస్య', 'సకృతామ్', 'దేవ', 'నాకం' అనే పదాలకు తోడు లోకం అనే పదం వేదాల్లో ఉపయోగించబడింది. (యజుర్వేదం: అధ్యాయం-15, మంత్రం-14; అథర్వణ వేదం: కాండం-4, సూత్రం-34; మంత్రం-2 మొదలు7; కాండం-9, సూక్తం-5, మంత్రం-18; అథర్వణ వేదం: కాండం-2, సూక్తం-10, మంత్రం-7; కాండం-9, సూక్తం-5, మంత్రం-9; కాండం-18, సూక్తం-3, మంత్రం-71వగైరా.) అంటే అది దేవలోకం, నాకలోకం వగైరాలుగా చెప్పబడింది.

స్వర్గం, సక్రతస్యం, నాకం, దేవం అనే పదాలు ఉన్నత జీవితానుభూతుల్ని సూచిస్తాయి. నాకం అన్న పదాన్ని 'నిరుక్తం' అనే గ్రంథం ఇలా ప్రయోగించింది.

"ఆ ప్రదేశాన్ని పొందినవానికి ఎలాంటి దుఃఖం ఉండదు."

(నిరుక్తం: అధ్యాయం-2, కాండం-14)

బ్రాహ్మణం అనే గ్రంథాలు ఆ ప్రదేశాన్ని చేరుకున్నవానికి ఎలాంటి దుఃఖం కలుగదు అని అంటాయి. బ్రాహ్మణాలు వేదవ్యాఖ్యానాలే.

'కం' అంటే సుఖం, సంతోషం. దానికి రెండు నకారాక్షరాలు (నెగెటివ్) 'న' మరియు 'అ' చేర్చబడి 'నాకం' అయింది. 'కం' అనే పదానికి ఒక నకారాక్షరం 'అ' చేర్చబడితే అది 'అకం' అయింది. అకం అంటే దుఃఖం. 'అకం'నకు 'న' చేరిస్తే 'నాకం' (న+అ+కం) అయింది. అంటే అర్థం సుఖం, సంతోషం అని.

దేవం అన్నా సుఖమే. కాబట్టి నిరుక్తం ఆ పదానికి అర్థం సుఖమనే చెబుతోంది. స్వర్గం, నాకం, దేవం వగైరాలు నిజానికి సుఖాన్ని కలిగించే ప్రదేశాలు.

నిరుక్తంలో ఇలా ఉంది:

"ఎవరి కర్మలైతే శ్రేష్ఠమైనవో వాళ్ళే అక్కడికి చేరుకుంటారు."

(నిరుక్తం: అధ్యాయం-2, కాండం-14)

మనుస్మృతిలోను స్వర్గం కోసం వాడబడ్డ పదాల ప్రకారం అర్థమయ్యేది అది ఓ ప్రత్యేక ప్రదేశమనే. ఉదాహరణకు, ఇందులో ఈ క్రింద ఇవ్వబడిన వాక్యాలు లభిస్తాయి:

"అతడు స్వర్గానికి చేరుకుంటాడు." (మను:అధ్యాయం-3, శ్లోకం-18)

"అతడు పైకి ఉన్నతమైన స్థానానికి వెడతాడు."

(అధ్యాయం-3, శ్లోకం-93)

"అతడు శాశ్వత లోకానికి వెడతాడు." (అధ్యాయం-2, శ్లోకం-5)

వేదాల్లోను, శాస్త్రాల్లోను 'లోకం' అనే పదం ఎక్కువగా ప్రదేశం, స్థానానికి ప్రయోగించడం జరిగింది. రుగ్వేదంలో ఈ పదం ఇరవైఎనిమిదిసార్లు ఉపయోగించబడింది. రెండుసార్లు బహువచనంగాను వాడబడింది. యజుర్వేదంలో దాదాపు యాభైసార్లు ఈ పదం వచ్చింది. సాయణాచార్యుడు ఈ సందర్భాల్లో ఆ పదానువాదం అధికంగా స్థానం లేక ప్రదేశం అనే చేశాడు. కాబట్టి స్వర్గాన్ని కేవలం రసానుభూతిగా, హృదయానుభూతిగా తీసుకోవడం సబబు కాదు.

## కర్మలకు తగ్గ ప్రతిఫలం

'స్వర్గం' దాన్ని పొందే హక్కుగల వారికే లభిస్తుంది. ఇహలోకంలో ఎవరే కర్మలు ఆచరిస్తున్నారో ఆ కర్మలన్నిటి రికార్డు (చిట్టా) సురక్షితం చేయబడుతూ ఉంది. హిందువుల పవిత్ర గ్రంథాల ప్రకారం, ఈ రికార్డునంతా దేవతలు రాస్తూ ఉన్నారని ఉంది.

మనులో ఇలా ఉంది:

"పాపాత్ములు తాము చేస్తున్న పాపాల్ని ఎవ్వరూ చూడటం లేదని అనుకుంటారు. ఆ పాపాల్ని దేవతలు చూస్తున్నారు. అదే కాకుండా అవి వారి అంతరాత్మలకు కూడా తెలిసే ఉంటాయి." (మను:అధ్యాయం-8, శ్లోకం-84)

కర్మల రికార్డును పరిరక్షించే వారిని పురాణాలు 'చిత్రగుప్తులు' అని చెబుతాయి. దివ్యఖుర్‌ఆన్ వీళ్ళను 'కిరామన్ కాతిబీన్' అని అంటుంది. పరలోకంలో కర్మలను తూచే విషయం శత్పథ బ్రాహ్మణంలో ఇలా ఉంది:

"భవిష్యత్ లోకం'లో వారు అతని సత్కర్మల్ని, దుష్కర్మల్ని త్రాసులో ఉంచుతారు. ఈ రెంటిలో ఏవి బరువుగా ఉంటాయో మనిషి వాటి వెంట వెడతాడు. ఆ కర్మలు మంచివైనా చెడ్డవైనా. ఎవరైనా ఈ విషయాన్ని (సత్యం అని) నమ్మి, ఈ లోకంలో తనను తాను త్రాసులో పెట్టదలిచాడో అతడు భవిష్యత్ లోకంలో లెఖ్ఖా పత్రం ఏమీ లేకుండా తప్పించుకుంటాడు."

(కాండం-11, ప్రపాఠకం-2, బ్రాహ్మణం-7, ఖండిక-33)

అంటే ఏ వ్యక్తయితే ఈ కర్మల తూకంపై విశ్వాసముంచి ఈ లోకంలో తన కర్మల్ని ఎప్పుడూ బేరీజు వేసుకుంటాడో, ముందు రాబోయే పరలోక జీవితంలో తన దుష్కర్మల పళ్ళెం బరువెక్కకుండా చూసుకుంటాడో, అతడు శిక్ష నుండి తప్పించుకునే ప్రయత్నం చేస్తాడు అని అర్థం.

## స్వర్గం ఎక్కడుంది?

ఈ లోకమే సమస్తం అని అనుకోవడం పెద్ద పొరపాటు. ఈ లోకమేకాక మరో లోకం కూడా ఉంది, అక్కడ స్వర్గనరకాలు ఉన్నాయి. ఈ విషయం కేవలం దివ్యఖుర్‌ఆన్‌లోనే చెప్పబడలేదు. హిందూ మత గ్రంథాల్లో కూడా ఈ విషయం స్పష్టంగా చెప్పబడింది. వేదాల ప్రకారం ఈ ప్రస్తుత జీవితం ఒక్కటే కాకుండా స్వర్గ జీవితం అన్నది కూడా ఒకటుంది. ఇహలోక జీవితం గురించి వేదాలు, 'ఇమమ్', 'అయమ్', 'అథః', 'అత్రాస్మిన్' మొదలైన సంజ్ఞల్ని వాడాయి. అదే విధంగా స్వర్గం గురించి అయమ్, తత్ర, తస్మిన్ లాంటి పదాలను వాడడం జరిగింది. దీని ద్వారా స్పష్టమవుతున్న విషయం ఏమిటంటే, స్వర్గలోకం అనేది ప్రస్తుత ప్రపంచంలో కాకుండా మరో లోకంలో ఉంది అన్నదే.

ఇదే కాకుండా వేదాల్లోని అనేక మంత్రాల్లో స్వర్గలోకాన్ని 'త్రితేయరజసే' (మూడో లోకం ఉంది), 'త్రినాకే' (హాయిని గొలిపే మూడో లోకం), 'తివిద్' (ఆకాశంలోని మూడో ప్రదేశం), త్రిభ్యకాండ్య (అది మూడో అంతస్తులో ఉంది), త్రాస్యామ్ (ఇచ్చటి నుండి మూడోది) అని చెప్పడం జరిగింది.

వేదాల్లో, ప్రస్తుత ఇహలోకాన్ని స్వర్గంగా చెప్పడం జరగలేదు.

ఋగ్వేదంలో ఇలా ఉంది:

"మూడో లోకం (అంటే స్వర్గం) ఆకాశ వెలుగులో ఉంది."(1-155-3)

అధర్వణ వేదంలో ఇలా ఉంది:

"భూమిపై నుండి దిగ్మండలం పైకి ఎక్కాడు. దిగ్మండలం నుండి ఆకాశం పైకెక్కాడు. అక్కడ నుండి వెలుగొందే స్థానం స్వర్గానికి వెళ్ళిపోయాడు."

(కాండం-4, సూక్తం-14, మంత్రం-17,67)

వీటి ద్వారా స్వర్గం అనేది ఓ ప్రత్యేక లోకం అని, అది ప్రస్తుత ఇహలోకం కంటే ఎంతో ఉన్నతమైనదని, శ్రేష్ఠమైనదని తెలుస్తోంది. అధర్వణ వేదంలో ఇది పరలోకంగా చెప్పబడింది.

## స్వర్గం అంటే ఏమిటి?

మనుషులు సహజంగా కోరుకునే లోకం స్వర్గలోకం. ఇది మనిషి కోరికకు అనుగుణమైనది. అతని అంతిమ శాశ్వత నివాసమూను. ఆ లోకం లోపరహితం.

ఋగ్వేదంలో ఇలా ఉంది:

"ఇంద్రా! మరణరహితమైన, వెలుగులతో నిండిన, శాశ్వత తేజస్సునిచ్చేది, పతన రహితమైన ఆ లోకానికి నన్ను చేర్చు."

(ఋగ్వేదం: మండలం-9, సూక్తం-113, మంత్రం-7)

"నన్ను ఉత్తమ కోరికల లోకంలో అనంతునిగా చెయ్యి. ఆ లోకం పూర్తిగా తేజోమయమైన లోకం. అది బ్రహ్మ యొక్క సామ్రాజ్యం. అక్కడ సకల తినుబండారాలు, సంపూర్ణ సుఖభోగాలు లభ్యమవుతాయి." (మంత్రం-10)

"ఎక్కడైతే ఆనందం, సౌఖ్యాలు, ఉత్తమమైన అనుభూతులు ఉన్నాయో, ఎక్కడైతే కోరుకున్న కోరికలన్నీ మొదటి నుండే లభ్యం అయి ఉన్నాయో ఆ లోకంలో నాకు ముక్తినొసగు." (మండలం-9, సూక్తం-113, మంత్రం-11)

"నన్ను అక్కడ అంతంలేనివానిగా చెయ్యి, ఎక్కడైతే ఇష్ట ప్రకారం నడుచుకుంటారో, ఏ లోకం అయితే ఆకాశపు పైభాగాన ఉందో, ఎక్కడైతే వెలుగొందే లోకాలున్నాయో." (మంత్రం-8)

"నన్ను ఆ లోకంలో శాశ్వతునిగా చెయ్యి. ఎక్కడైతే 'మోదం', 'ముదావహం' మరియు 'ప్రమోదం' అనే మూడు రకాల సుఖానుభూతులు ఉంటాయో, చిరకాల కోరికలు ఈడేరుతాయో." (మంత్రం-11)

ఈ మంత్రంలో చెప్పబడ్డ సుఖానుభూతులు, మోదం, మూదావహం, ప్రమోదాలు సంభోగానికి సంబంధించిన సుఖానుభూతులు. ప్రమోదం అనే పదం వేదాల్లో ప్రత్యేకంగా సంభోగ సుఖం కోసమే వాడబడింది. దీనివల్ల అర్థం అయ్యేది ఏమిటంటే స్వర్గంలో, స్వర్గవాసులకు భార్యలు లభిస్తారన్నదే. దీనికి రుజువు వేదాల్లోని ఇతర వివరణల్లో కూడా లభిస్తుంది.

అధర్వణ వేదంలో ఇలా ఉంది:

"దానధర్మాలు చేసేవాడు (దాత) మొదట సురభం (అందమైన స్వర్గం) అనే ప్రదేశాన్ని పొందుతాడు. ఆ తరువాత అతడు మంచి వస్త్రాలను, అందమైన స్త్రీని, ఘాటైన సారాయిని పొందుతాడు." (10-107-9)

"వాళ్ళు రాళ్ళూ రప్పలూలేని పరిశుభ్రమైన వెలుగులు చిమ్మే స్వర్గానికి వెడతారు.... వారి కోసం ఆ స్వర్గంలో ఎందరో స్త్రీలుంటారు."

(అధర్వణ వేదం:4-43-2)

"స్వర్గంలో మనిషి ముసలివాడుకాడు. అక్కడ ఎవ్వరికీ మరణం అనేది రాదు."

"స్వర్గంలో ఎలాంటి భయం లేదు. అక్కడ ఎవ్వరికీ మరణం రాదు. అక్కడ ముసలి తనం వచ్చే భయమూ లేదు. మనిషి ఆకలిదప్పుల నుండి విముక్తి పొంది స్వర్గంలో సౌఖ్యాలను అనుభవిస్తాడు." (13)

అధర్వణ వేదంలోని మరో మంత్రంలో ఇలా ఉంది:

"ఈ స్వర్గలోకం అమృతంతో నిండి ఉంది." (18-4-3)

"ఓ మనిషీ! 'ఋత్' అనే పదం ఈ మార్గాన్ని చూడు. దేనిపైనయితే పుణ్యాత్ములు, అంగ్రసులు, భయభీతి కలవారు నడుస్తారో, ఈ మార్గాల ద్వారా నీవూ స్వర్గం వైపునకు నడువు- ఎక్కడయితే 'ఆదిత్య' దేవతలు తేనె త్రాగుతూ ఉంటారో." (అధర్వణ వేదం: 18-4-3)

"ఎక్కడయితే కోరికల కోరికలే ఈడేర్చబడతాయో అక్కడ నాకు శాశ్వతను చేకూర్చు." (111-7-11)

అధర్వణ వేదంలో, "అక్కడి నుండి ఎవ్వరినీ బయటకు పంపించడం జరుగదు" అని ఉంది.

"ఇలాంటి అమరుడవు. నీవక్కడ మరణించవుగాక మరణించవు, భయపడకు. అక్కడివారు మరణించరు, ఏ గాఢాంధకారంలోనూ పడవేయబడరు." (అధర్వణ వేదం: 8-2-24)

"ఆ ముక్తిలోకంలో అంతం కానటువంటి తేజస్సు ఉంది. అన్ని విధాల వెలుగు, సుఖం ఉన్నాయి. ఆ స్వర్గంలో 'అనూకామం' ఉంది. అక్కడి లోకాలు వెలుగొందుతూ ఉంటాయి. అక్కడ 'కామం', 'నికామం', 'సుధ', 'తృప్తి', 'ఆనందం', 'మోదం', 'ప్రమోదం' ఉన్నాయి. అక్కడ మనోవాంఛలన్నీ తీర్చబడతాయి." (రుగ్వేదం: 9-113-7-9)

"ఏ విధంగానైతే తీగ నుండి దోసకాయ వేరైపోతుందో, అలాగే నేనూ మరణం నుండి విముక్తి పొంది శాశ్వతకు దూరం కాకూడదు." (రుగ్వేదం: 7-59-12)

స్వర్గం కేవలం ఆత్మ సంబంధమైనది కాదు. అక్కడ మనిషి శరీరాన్ని కలిగి ఉంటాడు. వేదాల్లో ఇలా ఉంది:

"ఓ దేవా! వీరికి పితృలోకాన్ని ప్రసాదించు మరియు వారికి వారి శరీరాన్ని నీ ఇష్టప్రకారం ప్రసాదించు." (రుగ్వేదం: 10-15-4)

"ఓ పితృలారా! శరీరాన్ని పొంది స్వర్గంలో ప్రవేశించి ఆనందించండి." (అధర్వణ వేదం: 18-4-64)

"నా ఆత్మ మంచి తేజస్సుతో కూడిన శరీరాన్ని పొందాలి." (అధర్వణ వేదం: 18-2-10)

శత్పథబ్రాహ్మణంలో ఇలా ఉంది:

"స్వర్గంలో మేము భార్యా పిల్లలతో ఉండేటట్లు అక్కడ మాకు మార్గం చూపు..... అంగవైకల్యరహితులమై మేము స్వర్గంలో మా తల్లిదండ్రుల్ని, కుమారుల్ని చూడాలి." (6-6)

కఠోపనిషత్తులో స్వర్గం నిర్వచనం ఇలా ఉంది:

"స్వర్గలోకంలో ఎలాంటి భయం లేదు..... అక్కడ ఎవ్వరూ ముసలితనం కల్గుతుందని భయపడరు. స్వర్గలోకంలో ఆకలిదప్పులను అధిగమించి మనిషి దుఃఖరహితుడై ఆనందిస్తాడు." (1:12)

## కొన్ని స్వర్గ దృశ్యాలు

స్వర్గదృశ్యాలు, వాటి ప్రత్యేకతలు కొన్నిటిని వేదాలు ఇలా చూపుతున్నాయి.

"తేనె రుచిగల వేలాది కాల్వలు మూడో ఆకాశంలో (స్వర్గంలో) ప్రవహిస్తున్నాయి." (అధర్వణ వేదం: 9-74-6)

"నెయ్యితో నిండిన కోనేరులు, తేనె తటాకాలు, సారాయి, పాలు, పెరుగు మరియు నీటితో పుష్కలంగా పారే తీయటి సెలయేళ్లు స్వర్గంలో నీకు లభిస్తాయి. కమలాలతో నిండిన సరస్సులూ నీకు లభిస్తాయి." (అధర్వణ వేదం: 4-34-6)

"ఆ ఈశ్వరుడు నెయ్యి, తేనె, సారాయి సెలయేళ్ళతో నా వద్దకు వచ్చాడు." (అధర్వణ వేదం : 10-6-25)

"దానం ఇచ్చేవాడు మొదట సుఖభోగాల ప్రదేశాన్ని (అంటే స్వర్గాన్ని) పొందాడు. ఆ తరువాత మంచి వస్త్రాలు ధరించిన స్త్రీలను, ఘాటైన మధుపాత్రను పొందాడు." (10-107-9)

"అమితంగా సుఖానుభూతుల్ని అందించే ఆ స్వర్గం కోసం నేను ప్రార్థిస్తున్నాను." (అధర్వణ వేదం: 2-2-2)

కౌశితకీయ బ్రాహ్మణంలో ఇలా ఉంది:

"అతని వద్దకు అయిదు వందల అప్సరసలొస్తారు. వంద మంది పూమాలలతోను, వంద మంది పరిమళాలు వెదజల్లే దంతమంజనాలతోను, వంద మంది కచ్చూరం మరియు కేసర పొడితోను, వంద మంది విలువైన అందమైన వస్త్రాభరణాలతోను మరో వంద మంది తమ దోసిళ్ళలో పూలు గైకొని వస్తారు. ఆ స్వర్గవాసుడ్ని ఆభరణాలతో అలంకరిస్తారు." (కౌశితకీయ బ్రాహ్మణం: 1-4)

"మహాభారత్' వివరణ ప్రకారం, స్వర్గం సత్కర్మలకు ఫలితంగా లభించే లోకం. ఇంద్రపురి వాటిలో అన్నిటికంటే ఘనమైనది. ఇంద్రపురిలో నందనవనం

ఉంది. అక్కడ మనిషి తనకు ఇష్టమైన రూపం ధరించి అప్సరసలతో కలసి నివసిస్తాడు. (ఆది పర్వం: 89-16-19)

"అక్కడ వృద్ధాప్యంగాని, దుఃఖంగాని, అలుపుసొలుపుగాని, భయభీతులు గాని ఉండవు. అక్కడ గంధర్వులు, అప్సరసలు నాట్యమాడుతూ సంగీతం, పాటలతో స్వర్గవాసులను అలరిస్తారు." (సభా పర్వం:7)

స్వర్గానికి చేరిన మానవాత్మలు తిరిగి రావు అని ఉపనిషత్తులు కూడా ధృవపరుస్తున్నాయి. ఇంకా అక్కడ పాపంగాని, అంధకారంగాని నామమాత్రంగా కూడా లేవు. అక్కడ ఎటువంటి వ్యాధి కూడా లేదు. ఆ లోకం సత్కర్మలకు ఫలితంగా లభించే లోకం. సతతం తేజోమయంగా ఉండే లోకం అని చెప్పబడింది వాటిలో.

స్వర్గంలో ఉండే కొన్ని వృక్షాల గురించి వేదాలు ఉటంకించాయి. ఉదాహరణకు:

"ఆ వృక్షాలపై కూర్చుని అందమైన పక్షులు మధురమైన ఫలాలు తింటాయి. వాటిపైన్నే అవి నివసిస్తాయి..... వాటి చిటారి కొమ్మలపై కూర్చొని, 'పీలం' అనే ఫలం అతిమధురమైన ఫలం, అయితే, తండ్రిని (పరమాత్మను) తెలుసుకోలేనివారు ఆ ఫలాన్ని పొందలేరు అని పలుకుతాయి."

(రుగ్వేదం: మండలం-1, సూక్తం-164, మంత్రం-20-22)

"మనపైనున్న మూడో ఆకాశంలో (అంటే స్వర్గంలో) రావి వృక్షం నిలబడి ఉంది. అది దేవతల నివాసం. అక్కడ వారు 'కష్ఠ' అనే మొక్కను పొందుతారు. ఆ మొక్క శాశ్వత జీవితానికి మూలం లేక శాశ్వత జీవితపు మూలం నుండి ఉద్భవించింది." (అధర్వణ వేదం)

"స్వర్గంలో సంగీతం, గానాలాపనల మాధుర్యం కూడా ఉంది."

(రుగ్వేదం: 10-135-7), (అధర్వణ వేదం: 4-37-4)

"ఈ పాటల్ని మధ్యాకాశంలో ఉండే స్వర్గ గంధర్వుడు మనకు గానం చేసి ఆలాపిస్తాడు." (రుగ్వేదం: మండలం-10, సూక్తం-39, మంత్రం-7)

ఈ గానం, సంగీతాల గురించి 'ఛావందగ్య ఉపనిషత్తు' 8-2-8లో ఇలా ఉంది.

"ఒకవేళ అతడు పాట, సంగీతం గురించి తలుచుకుంటే వెంటనే అతని అభిరుచికి తగిన సంగీతం, పాటలు అతని ముందు ప్రత్యక్షమవుతాయి. వాటిని పొంది అతడు ఆనందిస్తాడు."

"యుద్ధంలో హతులైన శూరుల గురించి దుఃఖించకు. చంపబడ్డ శూరులు దుఃఖించతగిన వారు కారు. అతడు స్వర్గంలో ఔన్నత్యాన్ని పొందుతాడు. యుద్ధంలో చంపబడ్డవానికి పిండ ప్రదానం, స్నానం, అశుద్ధతల్ని గురించిన నియమాలను పాటించరు. యుద్ధంలో చనిపోయిన వీరుని కోసం వేలాది అప్సరసలు పరుగెత్తుకొస్తారు. ప్రతి అప్సరస అతడు తన భర్త కావాలని కోరుకుంటుంది."
(మహాభారతం: శాంతి పర్వం-98-44-47)

"పరిశుద్ధమైన నందనవనం వగైరాలు పుణ్యాత్ముల విలాస ప్రదేశాలు. అక్కడ ఆకలిదప్పులుగాని, అలుపుసొలుపుగాని, చలి వేసవితాపాలుగాని, మరెలాంటి ప్రమాదాలుగాని ఉండవు. అక్కడ అశుద్ధమైన నీచమైన వస్తువు ఏదీ లేదు. అన్నివిధాలుగా సుఖమయినది. అక్కడ సువాసనలతో కూడిన గాలులు వీస్తుంటాయి. అచ్చటి గానాలు వీనులకు విందుగా, హృదయాలను రంజింపజేసేవిగా ఉంటాయి. అక్కడ దుఃఖంగాని, వృద్ధాప్యంగాని, శ్రమగాని, బాధగాని ఉండవు. ఈ లోకం సత్కర్మలకు ఫలితంగా లభించేది. తమ కర్మలకు ప్రతిగా మనుషులు ఇక్కడ జన్మిస్తారు. ఇక్కడ పుట్టే ప్రతి మనిషి శరీరం అతని కర్మలకు అనుగుణంగా తేజోమయంగా ఉంటుంది. తల్లిదండ్రుల వల్ల వారక్కడ పుట్టరు. వారికి చెమటగాని, చెడు వాసనగాని, మలమూత్రాలుగాని ఉండవు. వారి వస్త్రాలు దుమ్ముధూళితో మాసిపోవు. వారి సువాసనలు వెదజల్లే అందమైన పూమాలలు ఎప్పుడూ వాడవు..... ఈర్ష్యా ద్వేషాలు, బాధలు, అలుపు వారి దగ్గరికే రావు."
(మహాభారతం: అరణ్యపర్వం-261:9-16)

"అక్కడ దుఃఖంగాని, ఈర్ష్యగాని, దురాశగాని, క్రోధంగాని లేవు. అక్కడ యువకులంతా తమ భార్యలతో ఉంటారు. సహస్ర సూర్యుల్లా ధగధగ వెలుగుతూ ఉంటారు."
(దేవీ భాగవతం: 12-12-50)

## స్వర్గానికి అర్హులెవరు?

స్వర్గానికి అర్హులెవరై ఉంటారు? ఎవరిని దానికి దూరంగా ఉంచడం జరుగుతుంది అన్న వివరాలు కూడా వేదాల్లోను, ఇతర మతగ్రంథాల్లోను చెప్పబడ్డాయి. ఆ వివరాలు కొన్నిటిని ఇక్కడ రాయడం జరిగింది:

"సత్కార్యాలు ఆచరించేవారు, ఎల్లప్పుడూ మంచిని గురించి ఆలోచించేవారు దేవుని దృష్టిలో ప్రియమైనవారు." (రుగ్వేదం: 10-31-2)

"మనిషి సత్యంపై ఎంతో నమ్రతగా నడవాలి." (రుగ్వేదం: 10-31-2)

"సత్కర్మలకు సత్ఫలితం పొందే ప్రదేశాన్ని నీవు పొందావు."

(అధర్వణ వేదం:2-10-7)

"భవిష్యత్ లోకాన్ని పొందేందుకు ఎవరు తెల్ల పాదాల గొర్రెను దానమిస్తాడో అతడు స్వర్గారోహణ చేస్తాడు. అక్కడ బలహీనుడు బలవంతునికి పన్ను కట్టడు." (అధర్వణ వేదం: 3-29-3)

"దానమిచ్చేవానికి ఆకాశ స్వర్గం ప్రాప్తమవుతుంది." (రుగ్వేదం: 10-125)

"భక్తితో దానం ఇచ్చేవారు స్వర్గాన్ని పొందుతారు."

(అధర్వణ వేదం: 9-5-18)

"ఈ ధనాన్ని నేను బ్రాహ్మణులకు ఒసగుతాను. పితృలోకం నుండే స్వర్గానికి పోయే మార్గాన్ని చూపుతాను." (అధర్వణ వేదం: 11-1-28)

"బలులు నిర్వహించేవారికి స్వర్గలోకంలో అమృతంతో నిండిన ఆహారం మరియు శక్తి ఒసగబడింది." (అధర్వణ వేదం: 18-4-25)

స్వర్గం పొందడానికి ఆచరణే ముఖ్యం కాదు, చిత్తశుద్ధి కూడా ఉండాలంటాయి వేదాలు.

"చిత్తశుద్ధి గలవారు ఈ స్వర్గాన్ని పొందగలరు."

(అధర్వణ వేదం: కాండం-6, సూక్తం-122, మంత్రం-3)

భగవద్గీతలో ఇలా ఉంది:

"హతోవా ప్రస్యాసీ స్వర్గ జిత్వా వా భోక్ష్యసే మహిమ్"

"ఓ కుంతీ కుమారా! నీవే గనక యుద్ధంలో హతుడవైతే స్వర్గం పొందుతావు. జయిస్తే భూమిని ఏలుతావు." (2:37)

భగవద్గీతలోని చివరి అధ్యాయంలో కృష్ణుడు, తమ తమ కర్మలకు అనుగుణంగా మనుషులు పరమేశ్వరుణ్ణి పొందుతారు, అదే వారి చివరి ఆశయం అని అంటాడు.

అధర్వణ వేదంలో ఇలా ఉంది:

"బలులిచ్చేవాడు, దాని ప్రతిఫలం, బహుమానాల వల్ల స్వర్గంలో నెయ్యితో నిండిన సెలయేళ్ళను మరియు తన కోరికలను పొందుతాడు."

(అధర్వణ వేదం: 18-4-5)

మను గ్రంథం అధ్యాయం-3, శ్లోకం-141లో ఇలా ఉంది:

"గ్రుడ్డి ఆవు గోశాలలో ఉండిపోయినట్లు (స్నేహితునిగా మార్చడానికి ఇచ్చే దానం) ఈ లోకంలోనే ఉండిపోతుంది."

"మాతృసేవ వల్ల ఈ లోకాన్ని, పితృసేవ వల్ల మధ్యలోకాన్ని, గురుసేవ వల్ల స్వర్గాన్ని పొందుతాడు." (మను: 2-212)

వ్యాస మహాముని ఉవాచ:

"పరోపకారం చేసేవాడు స్వర్గానికి వెడతాడు; పరులను పీడించేవాడు నరకానికి వెడతాడు."

## నరకం

సత్యాన్ని వ్యతిరేకించేవారు, ఎలాంటి సదాచరణ లేనివారు మాత్రమే నరకానికి పోతారు. వేదాల ప్రకారం, నరకం అంధకారబంధురమైన ప్రదేశం. అందులో అధర్ములు, పాపులు ప్రవేశింపజేయబడతారు. నరకాలు అనేకం. అవన్నీ అంధకారంతో నిండి ఉన్నవే.

నరకం గురించి యజుర్వేదం ఇలా చెబుతోంది:

"ఆ లోకాలు సూర్యుడు లేని లోకాలు. ఎల్లెడలా అంధకారం వ్యాపించి ఉంటుంది. అందులో ఆత్మహత్యలకు పాల్పడేవారు ప్రవేశిస్తారు."

(యజుర్వేదం: 40-2)

"ఎవరైతే తన హృదయాన్ని మలినపర్చుకుంటాడో అతడు ఆ అధోలోకంలో పడిపోతాడు." (అధర్వణ వేదం: 20-128-2)

'ఈశావాసోపనిషత్తు', నరకం అంధకారబంధురమైనదిగా చెబుతూ, అజ్ఞానపిపాసకులు చీకటి లోకాల్లో ప్రవేశిస్తారని చెప్పింది.

పురాణాల్లో, ముఖ్యంగా విష్ణు పురాణం (2-6-1 నుండి 29), శ్రీమద్ భాగవతం (5-6-1 నుండి 37) లో నరకం గురించిన ప్రస్తావన వివరంగా లభిస్తుంది.

నరకాల సంఖ్య వందలాదిగా వేలాదిగా చెప్పబడింది. నరకాల సంఖ్య అధమంగా ఏడని, విష్ణుపురాణం, యోగ సూత్రాల వ్యాస భాష్యం (3-26), శంకరాచార్యుని వేదాంతభాష్యం 3-1-15 లో ఉంది. ఆ తరువాత వాటి సంఖ్య ఇరవైఒక్కటి వరకు పెరిగింది. వీటి పేర్లు మనుస్మృతి (4-88-90), శ్రీమద్భాగవతం (5-26-7) లో చూడవచ్చు. విష్ణు పురాణం (2-6-2 నుండి 5 వరకు) ఇంకా శ్రీమద్భాగవతం (7-26-6)లో ఇరవై ఎనిమిది నరకాల ప్రస్తావన ఉంది. సుఖ్‌సాగర్‌లో వివరంగా ఏ దుష్కర్మకు ఫలితంగా ఏ నరకం ప్రాప్తమవుతుందో విడమర్చి చెప్పడం జరిగింది. ఉదాహరణకు, సుఖ్‌సాగర్ పేజి 293 నుండి 296, శ్రీమద్‌భాగవతం 5:26లో కొన్ని శ్లోకాలు ఇక్కడ గమనించదగ్గవి.

"నేను, నాది అనే అహంకారంతో ఇతరులతో వైరం పెంచుకొని కేవలం తన కుటుంబాన్నే పోషించుకుంటాడో అతడు 'రైరవ' అనే నరకంలో పడిపోతాడు. ఏ పురుషుడు లేక స్త్రీ, 'అగమ్య' స్త్రీ లేక పురుషునితో సంభోగిస్తారో వారిరువురిని కొరడాలతో కొడుతూ 'తప్తసర్మి' అనే నరకంలోనికి తీసికెళ్ళి పడవేస్తారు. ఆ తరువాత ఎర్రగా కాలుతున్న ఇనుప విగ్రహాలకు వారిని కట్టిపడేస్తారు. అక్కడ వారు కాలుతూ ఉంటారు... ఏ రాజులు లేక రాజప్రతినిధులైతే ధర్మాన్ని లేక ఆరాధనాలయాలను, ఇతర ప్రదేశాలను నాశనం చేస్తారో వారు అశుద్ధం, మలమూత్రాలు, రక్తం, వెంట్రుకలు, కొవ్వు, గోళ్ళు, ఎముకలతో నిండిన 'వైతరణి' నదిలో మునకలేస్తారు.... ఎవరైతే తప్పుడు సాక్ష్యం ఇస్తారో వారు 'అవీచి' అనే నరకంలో నూరు యోజనాల ఎత్తు గల కొండపై నుండి పడవేయబడతారు. ఏ బ్రాహ్మణ, క్షత్రియులు, వైశ్యులు లేక వారి స్త్రీలు అయినా ఎలాంటి జంకులేకుండా మద్యాన్ని సేవిస్తారో వారిని 'అయఃపానం' అనే నరకంలో పడవేసి వారి నోటిలో కరిగిన ఇనుప రసం పోస్తారు యమదూతలు.... ఎవరైతే ధనమదంతో ధనం అయిపోతుందేమోనన్న బెంగతో దురాశాపరుడై దయ్యంలా కూడబెడతాడో, దాన్ని ఖర్చుపెట్టకుండా, దానం చేయకుండా ఉంటాడో అతడు 'సూచీముఖ' అనే నరకంలో పోయి పడతాడు. అక్కడ యమదూతలు అతణ్ణి సూదులతో పొడుస్తుంటారు."

ఇరవైఒక్క నరకాలను కుదిస్తే పైన చెప్పిన ఏడు నరకాలుగా తేలుతాయి. వేదాల్లో నరకాల వివరణ స్పష్టంగా చెప్పబడింది. ఉదాహరణకు రుగ్వేదంలో ఇలా ఉంది:

"వారు పాపాల పుట్ట, అసత్యవాదులు, కృతఘ్నులు. వారే ఈ అధోలోకాన్ని (నరకాన్ని) సృష్టించుకున్నారు. (అంటే వారి దుష్కర్మల కారణంగా ఈ నరకాన్ని ఉనికిలోనికి తీసుకురావడం జరిగింది అన్నమాట.)" (రుగ్వేదం: 4-5-5)

"ఓ ఇంద్రా! ఓ సోమా! అగ్ని మంటలకు పాత్రలోని నీళ్ళు ఎలా మసలుతాయో అలా పాపాత్ముల చుట్టూ వారి పాపాలు మసలుతుంటాయి." (రుగ్వేదం: 7-104-2)

"దుష్కార్యాలకు పాల్పడేవారిని లోతైన గోతిలోని అంధకారంలో పడవేయండి- అక్కడి నుండి వారు బయటకు రాని విధంగా. వారిలో ఏ ఒక్కడు ఏ నాటికిని తిరిగి బయటకు రాడు." (మంత్రం-3)

పై శ్లోకాల ద్వారా తేలిందేమిటంటే నరకయాతన శాశ్వతమైనది. తాత్కాలికం కాదు అన్నదే. ఇది ఇస్లామ్ భావనకు పూర్తిగా సరిపోయే భావన.

గరుడ పురాణంలో ఇలా ఉంది:

"వెలుగులతో ధగధగలాడే యమరాజపురం, అప్సరసలతో, గాయకులతో నిండి ఉంది. అక్కడ ఎనభైనాల్గు లక్షల నరకాలు ఉన్నాయి." (గరుడ పురాణం: ప్రేతకల్పం: 4:19)

హిందువుల్లో, ఎనభైనాల్గు లక్షల దేహాలు ఉన్నాయని, పునర్జన్మ కారణంగా ఆత్మ ఆ ఎనభైనాల్గు లక్షల దేహాల్లోను ప్రవేశిస్తుందనే భావన ఉంది. కాని పై మంత్రంలో వాటిని ఎనభైనాలుగు లక్షల నరకాలుగా చెప్పబడింది. గరుడ పురాణం-ప్రేతకల్పం-5:20లో ఈ ఎనభైనాల్గు లక్షల నరకాల ప్రస్తావన వచ్చింది. వాటిలో ఇరవైఒక్క నరకాలు మాత్రం భయంకరమైన నరకాలుగా చెప్పబడ్డాయి.

## నరకానికి అర్హులెవరు?

నరకం అనేది దుష్కర్మలకు పాల్పడేవారికి, చెడ్డవారికి నివాస స్థలం. ఎవరైతే స్వర్గానికి అర్హులుకారో వారి నివాసం నరకం.

అధర్వణ వేదంలో ఇలా ఉంది:

"ఎవరైతే, బ్రాహ్మణుడికి యాచించినా దానం చెయ్యరో వారి కోసం నరకం ఉంది అని అంటారు." (12-4-36)

భాగవతంలో ఇలా ఉంది:

"ఎవరైతే ఒక వ్యక్తిని మోసగించి అతని భార్యను వలలో వేసుకుంటాడో అతణ్ణి యమదూతలు అంధకార నిలయమైన నరకంలో పడవేస్తారు. అందులో పడిన మనిషి బాధతో మూలుగుతాడు. మనిషి అక్కడ వెంటనే గ్రుడ్డివానిగా, పిచ్చివానిగా మారిపోతాడు. ఇంకా అతడు మొదలు నరకిన మ్రానులా పడిపోతాడు." (దేవీ భాగవతం: 8:5-6)

"నాది, నేను అనే అహంకారంతో ఇతరుల ఎడల ఎవరైతే అసూయ అవలంబించి, మోసం దగాలతో తన కుటుంబాన్ని పోషించుకుంటూ ఉంటాడో, అతడు చనిపోయిన తరువాత తన దుష్కర్మలకు ఫలితంగా ఇందులో (నరకంలో) పడిపోతాడు." (దేవీ భాగవతం: 8:8-9)

"హద్దులను అతిక్రమించేవారు 'వైతరణి' (ముంచివేసేది) నదిలో పడిపోతాడు. ఓ నారదా! ఈ నది నరక ప్రాకారానికి చెందిన ఓ అగడ్త." (దేవీ భాగవతం: 8:39-40)

## బౌద్ధ మతం-పరలోక భావన

జైన బౌద్ధ మతాల్లోనూ, స్వర్గం నరకం అనే భావాలు లభిస్తాయి. ఈ సందర్భంలో కొన్ని కొటేషన్లను ఇక్కడ చూయించడం జరిగింది.

"ఓ గృహ బాధ్యులారా! దానం, సత్కర్మలు, దుష్కర్మలు, ఇహలోకం, పరలోకం అనేది ఏదీ లేదు అన్నది మతవ్యతిరేక వైఖరి. ఈ వైఖరి అవలంబించేవారు తమ శరీరాలను వదిలేసిన తరువాత నరకానికి వెళతారు." (మజ్జం నకాయే:1-5-1)

"ధర్మాన్ని అవలంబించాలి, చెడు పనులు చేయకూడదు. ధర్మంపై నడిచేవాడు ఇహపర లోకాల్లో సుఖంగా ఉంటాడు." (ధంపద్‌లోక్ విగ్గూ: 3)

"ఈ ప్రపంచం గ్రుడ్డివాని లాంటిది. అతనికి కనబడేది తక్కువ. బంధనాలు త్రెంచుకొని స్వేచ్ఛ పొందిన పక్షిలా స్వర్గానికి వెళ్ళేవారు బహుతక్కువ."
(ధంపద్‌లోక్ విగ్గా: 8)

"సత్యాన్ని వీడి అసత్యం అవలంబించేవాడు, ధర్మావధుల్ని దాటేవాడు పరలోక చింతన లేనివాడు ఎంత పెద్ద పాపానికైనా ఒడిగట్టగలడు."
(ధంపద్‌లోక్ విగ్గా: 10)

"ఏ భ్రష్టుడు పరుని భార్యను ముట్టుకుంటాడో అతడు నాల్గు దుష్పరిణామాలకు గురౌతాడు. (1) అతడు పాపాన్ని ప్రోగుచేసుకుంటాడు. (2) సుఖంగా నిద్రపోలేడు. (3) ప్రపంచంలో అతడు అగౌరవం పాలవుతాడు. (4) చివరికి నరకానికి వెడతాడు." (ధంపద్‌నిరే విగ్గా: 22:4)

"అతణ్ణి (పాపాత్ముణ్ణి) అగ్ని కీలలతో ఎర్రగా మండుతున్న పెద్ద కొండపైకి ఎక్కించి దింపుతూ ఉంటారు..... అతణ్ణి తలక్రిందులుగా పట్టి ఎర్రగా కాలుతున్న లోహపు కుంభంలో పడవేస్తారు. అక్కడ అతడు నురుగులు క్రక్కుతూ ఉడుకుతాడు. అలా ఒకసారి పైకి వచ్చి మరోసారి క్రిందికి పోతూ ఇంకోసారి అన్ని మూలలకు వెడుతూ ఉంటాడు." (దైవప్రవక్తలు: 3:3)

"ఓ భిక్షువులారా! అప్పుడు అతణ్ణి నరక భటులు బయటకు తీసి క్రింద పెడతారు. అప్పుడు అతనితో, ఓ మనిషి! నీవు కోరేది ఏమిటి అని అడుగుతారు. నేను ఆకలిగొని ఉన్నాను అని బదులిస్తాడు. ఓ భిక్షువులారా! అప్పుడు నరక భటులు కాలుతున్న ఎర్రటి కడ్డీతో అతని నోటిని చించుతారు. బాగా ఎర్రగా కాలుతున్న లోహపు కడ్డీని అతని నోట్లో పడవేస్తారు. అది అతని పెదాలను, గొంతులను, ఎదురు రొమ్మును ఆ తరువాత అతని పొట్టను, ప్రేవుల్ని కాల్చుకుంటూ క్రింది భాగం నుండి బయటకు పడిపోతుంది... నరక దూతలు తిరిగి, ఓ మనిషి! ఇంకేం కావాలి నీకు అని అడుగుతారు. నాకు దాహం వేస్తుంది అని అంటాడు వాడు. ఓ భిక్షువులారా! అప్పుడు ఆ నరక భటులు బాగా ఎర్రగా కాలిన కడ్డీతో అతని నోటిని చీల్చి మరుగుతున్న రాగిని త్రాపుతారు. అది ప్రేవుల ద్వారా క్రింది భాగం నుండి బయటకు వచ్చేస్తుంది." (దైవప్రవక్తలు: 3:3)

"జూదగాడు మొదటి ఎత్తులోనే బోలెడు ధనాన్ని పొందవచ్చు. కాని ఓ భిక్షువులారా! ఆ ఎత్తు ఎంతో చిన్నఎత్తు. అంతకంటే పెద్ద ఎత్తు ఏదైతే ఉం

అది శరీరం, ఆత్మ మరియు నోటి ద్వారా పుణ్యాలను సంపాదించడం. శరీరాన్ని విడిచి చనిపోయిన తరువాత పుణ్యకార్యాలతో స్వర్గంలో జన్మించడం."

( మజ్జం నికాయే: 3:3)

బౌద్ధ మతంలో స్వర్గం గురించి లభించే వివరాల ద్వారా, స్వర్గంలో ఆరోగ్యం, ఐశ్వర్యం, యవ్వనం, అందమైన స్త్రీలు వగైరాలు, అన్నిరకాల భోగాలతో కూడిన వస్తువులు లభిస్తాయని తెలుస్తోంది. నరకంలో నేరస్తులకు అన్నిరకాల యాతనలు లభిస్తాయి.

మరణానంతర జీవితంపై భారతీయ వాస్తవ దృక్పథం ఏమిటో అర్థం చేసుకోవడానికి పరలోక భావన గురించి ఇక్కడ జరిపిన పరిశీలన సరిపోతుంది. భారతీయ వాస్తవ సిద్ధాంతం పరలోక వాదమే. దీన్నిబట్టి సత్యవాదులు సతతం పరలోకం వైపునకే పిలుపునిచ్చారన్న ఖుర్ఆన్ వివరణ నూటికి నూరుపాళ్ళు యదార్థం అన్న విషయం మరింత ధృవపడుతోంది. దివ్య ఖుర్ఆన్ ప్రకారం ఈ ప్రపంచం అంతం అయిపోయేదే. అయితే పరలోకం మాత్రం శాశ్వతంగా ఉంటుంది. పరలోకంలో మానవులు రెండు వర్గాలుగా విడిపోతారు.

**"ఫరీఖున్ ఫిల్ జన్నతి వ ఫరీఖున్ ఫిస్సయీర్"** ఒక వర్గం స్వర్గంలో ప్రవేశిస్తే మరో వర్గం అగ్నికీలల్లో పడిపోతుంది. మనిషి ఏ వర్గంలో చేరదలిచాడో స్వయంగా ఆలోచించి నిర్ణయించుకోవలసిన సమయమిది.

-: సమాప్తం :-